www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 124 శుక్రవారం, సెప్టెంబర్ 18, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం



2లో

## తెలంగాణ నేలది
# ధిక్కార స్వరం



● భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసమే కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ● సెప్టెంబర్ 17 ప్రజాస్వామిక పాలనకు ?మార్గం వేసిన రోజు ● రైతులకు భరోసా ఉండాలి...?మహిళలు ఆర్థికంగా ఎదగాలి ● ప్రతి పేదబిడ్డకూ విద్య, వైద్యం అందించడమే లక్ష్యం ● ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరాలనే లక్ష్యంతో పాలన : ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అనీ, సమ్మక్క సారలమ్మ పోరాటం, తెలంగాణ రైతాంగ సాయు ధ పోరాటం, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వరకు ఏది చూసినా అన్యాయాన్ని ఎదిరించడమే తెలంగాణ గడ్డ స్వభావ మని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పు టికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలి స్తూనే ఉందన్నారు. తెలంగాణ చరిత్ర ప్రజలే కేంద్రంగా పాలన ఉండాలని చెబుతున్నదనీ, అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ, ప్రపంచంతో పోటీపడేలా ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. మిగతా2లో...

## నా దేవాలయ సందర్శనను
# వక్రీకరించారు

● బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** రాజకీయ స్వలాభం కోసం, పవిత్రమైన దేవాలయ సందర్శనను వక్రీకరించి తనపై అత్యంత చవకబారు ఆరోపణలు చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌లపై బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్ రావు పరువు నష్టం దావా దాఖలు చేశారు. తనపై క్షుద్రపూజల ఆరోపణలు చేసిన ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతలపై హరీశ్‌రావు తరపు న్యాయవాదులు గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ క్రిమినల్ వద్ద పరువు నష్టం దావా దాఖలు చేశారు. బీఎన్ఎస్ 2023 చట్టంలోని సెక్షన్ 356 కింద వారిపై కఠిన చర్యలు మిగతా2లో...

## సెమీకండక్టర్ రంగంలో
# ముందడుగు

● నాలుగేండ్లలోనే లక్ష్యాన్ని సాధించాం :మోడీ ● 76వ ఏట అడుగుపెట్టిన ప్రధానికి పలువురి శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 17 :** భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేండ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ మిగతా2లో...

## కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో
# విచారణకు సిద్ధం

ముఖ్యమంత్రికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించాలి

అసత్యాలతో అసెంబ్లీ పవిత్రతను దెబ్బతీస్తున్న సీఎం

మాపై సస్పెన్షన్ ఎత్తేసి నెలరోజులు సభ జరపాలి :జాతీయ సమైక్యతా దినోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన నాటి నుంచి నేటి వరకు, సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 - జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మిగతా2లో...


2లో

## డిసెంబర్ నుంచి 'హార్వర్డ్' కోర్సులు

## పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 30 న తుది ఓటర్ల జాబితా

ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం



2లో

## కేసీఆర్ కుటుంబ ఆస్తులపై
# విచారణ జరగాల్సిందే..

- టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు



**ఢిల్లీ,సెప్టెంబర్ 17** ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన 'ఆఫ్ ది రికార్డ్' సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ ఆస్తుల పెరిగిపోవడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ కుటుంబ భూముల గురించిన వివరాలను చాలా లోతుగా సభ దృష్టికి తీసుకువచ్చారని మిగతా2లో...

## అడ్డంగా దొరికిన కెసిఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** ఎన్నికల అఫిడవిట్‌తో కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికిపోయిందని, సున్నా నుంచి వేల కోట్ల విలువైన ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కెసిఆర్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. తనకు ఒక్క ఎకరం కూడా భూమి లేదని 2004 కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కెసిఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు.

మిగతా2లో...

# తెలంగాణ నేలది ధిక్కార స్వరం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశంలో నిజాం ప్రాంతం అంతర్భాగం కావాలన్న ఆకాంక్షతో ఆంధ్రమహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు జరిగాయని వివరించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటానికి రావి నారాయణరెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం వంటి ఎందరో యోధులు నాయకత్వం వహించారని తెలిపారు. ఆపరేషన్ పోలోతో నిజాం ప్రభువు భారత ప్రభుత్వానికి లొంగిపోయారనీ, 1947 సెప్టెంబర్ 17 నిజాం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామిక పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రాత్మక సందర్భమని చెప్పారు. అందుకే ప్రజా పాలన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపడం, హక్కులను కాపాడటం, ప్రభుత్వ వనరులు అందరికీ అందేలా చూడటం, ప్రతి మనిషీ ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితి కల్పించడమే ప్రజా పాలన అని స్పష్టం చేశారు.

**ప్రజాప్రభుత్వం రైతు పక్షపాతి** ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి అనీ, రూ.20,616 కోట్లు విడుదల చేసి రుణమాఫీ ద్వారా 23.35 లక్షల రైతుల కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయపడేశామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి రూ.1.72 లక్షల కోట్లు ఖర్చుచేశామని వివరించారు. భూభారతి చట్టం ద్వారా సంస్కరణలు తీసుకొచ్చామనీ, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించామనీ, 5.94 లక్షల మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశామని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామనీ, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీ వంటి పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరిందనీ, ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికమని చెప్పారు.

**ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి...ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగాలి** రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డా ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదిగి సగర్వంగా జీవించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల ఖర్చు ఆదా అయిందని వివరించారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా 1.68 లక్షల మంది ఆడబిడ్డలకు రూ.4,709 కోట్ల సహాయం చేశామని చెప్పారు. స్వయం సహాయక సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజి, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించామని వివరించారు. మహిళా మార్టులు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దెబస్సులు, సోలార్ ప్లాంట్ల ద్వారా మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వామిగా నిలబెడుతున్నామని సగర్వంగా చెప్పారు.

**ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలి** రాష్ట్రంలోని ప్రతి కుటుంబమూ ఆత్మగౌరవంతో జీవించాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 15 లక్షలకుపైగా కొత్త రేషన్‌కార్డులు జారీ చేశామనీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 45 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామనీ, త్వరలో మరో 2.25 లక్షల మందికి ఇస్తామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్లకు తొలిదశలో రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రెండో దశలో మరో 2.50 లక్షల ఇండ్లు మంజూరు చేశామనీ, హైదరాబాద్ పరిధిలో ఇందిరమ్మ టవర్ల ద్వారా లక్ష ఇండ్లు కడుతామని తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించామనీ, దాని ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతికి పంపామని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుననుసరించి దేశంలోనే తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేపట్టామని తెలిపారు. అందుకే ప్రతి ఏటా ఫిబ్రవరి నాలుగో తేదీన తెలంగాణ సోషల్ జస్టిస్ డేను నిర్వహిస్తున్నామన్నారు.

**విద్యా, వైద్యం రెండు కండ్లు** తమ ప్రజాప్రభుత్వానికి విద్యా, వైద్యం రెండు కండ్లలాంటివని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామన్నారు. విద్యార్థులకు అల్పాహారం, పాలు ఇచ్చేందుకు రూ.927 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. 11 లక్షలమంది విద్యార్థులకు నేరుగా స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్లనే నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. విద్యారంగంలో తీసుకున్న చర్యలతో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందని తెలిపారు. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, బ్రిటన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ ద్వారా ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామనీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2,526 కోట్ల సహాయాన్ని అందించామని వివరించారు. గోషామహల్‌లో రూ.2,700 కోట్లతో నూతన ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం మొదలైందన్నారు. సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభించామనీ, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌లను, వరంగల్ ఆస్పత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామనీ, ఆ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. యువతలో నైపుణ్యాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామనీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు.

**మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నాం** రాష్ట్రంలో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామనీ, రూ.38,595 కోట్లతో 122.9 కిలోమీటర్ల మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు పంపామనీ, ఆదిలాబాద్, మామునూరు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 55 కిలోమీటర్ల పరిధిలో మూసీని పునరుజ్జీవింపజేస్తున్నామన్నారు. ఆహార కల్తీని అరికట్టేందుకు టీజీసేఫ్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, దేశ జీడీపీలో 10 శాతానికి వాటాను పెంచాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల్లో ప్రత్యేక జోన్లతో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలోనే తొలి నెట్ జీరో స్మార్ట్ సిటీగా నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026లో ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తామని చెప్పారు. రీజినల్ రింగురోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్అండ్‌బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6,924 కోట్లతో రహదారుల పనులు సాగుతున్నాయన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయనీ, ఈ నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నామని తెలిపారు. దీనిపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించే విషయంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు.

# కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందనీ, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ వైపు ఏ తప్పైనా బయటపడితే చట్టపరంగా ఎలాంటి శిక్షకైనా తాము సిద్ధమని ప్రకటించారు.

**కాంగ్రెస్ హామీలన్నీ బోగస్** కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యిరోజుల విఫల పాలన చూశాక తేలిపోయిందని కేటీఆర్ విమర్శించారు. వాటిపై నిలదీస్తామన్న భయంతోనే బీఆర్ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని అన్నారు. సభలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా బీజేపీతో రేవంత్ రెడ్డి కుమ్మక్కై అసెంబ్లీని ఏకపక్షంగా నడిపించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదన్న రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్నా. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజులపాటు పొడిగించి, మాపై సస్పెన్షన్లను ఎత్తేయండి. కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై ప్రజల పక్షాన కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ. నాలుగు వేల పింఛన్లు, రైతులకు కరెంట్, సాగునీరు, రైతుబంధు, అర్ధాంతరంగా రద్దు చేసిన రైతుబీమాపై సభాముఖంగా నిలదీస్తామని చెప్పారు.

**ముఖ్యమంత్రి పదవికే రేవంత్‌రెడ్డి కళంకం** చట్టసభల్లో అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్న వ్యక్తులు హుందాగా, పెద్దరికంతో మాట్లాడాలే తప్ప అసత్యాలు, అర్ధసత్యాలతో ప్రజలను, రాష్ట్రాన్ని, శాసనసభను తప్పుదోవ పట్టించడం అత్యంత బాధాకరమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను దుర్వినియోగం చేశారనీ, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను చూసి అతను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెప్తే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును రేవంత్‌రెడ్డి ప్రస్తావించారని గుర్తు చేశారు. ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ఎద్దేవా చేశారు.

**సీఎం మాటల్లోనూ అంతే నిజం** పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో 150 బెడ్రూములు ఉన్నాయనీ, బంగారు బాత్రూమ్‌లు కట్టారనీ, కొత్త సచివాలయం కింద నుంచి సొరంగం తవ్వుకుని లంకెబిందెలు తరలిస్తున్నారని చేసిన చిల్లర ప్రచారంలో ఎంత వాస్తవముందో, అసెంబ్లీలో సీఎం మాట్లాడిన మాటల్లోనూ అంతే నిజముందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అభయహస్తం మ్యానిఫెస్టో, ఆరు గ్యారెంటీలు ఏ మేరకు అమలయ్యాయో, ముఖ్యమంత్రి ప్రసంగం కూడా అంతే వాస్తవరూపమని చెప్పారు. మైసూరు బజ్జీలో ఎంతైతే మైసూరు ఉంటుందో రేవంత్ రెడ్డి మాటల్లోనూ అంతే నిజముందని వివరించారు. రూ.80,000 కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని ఊరూరా ప్రచారం చేసి, ఢిల్లీ నుంచి ఆర్టిస్టులను, టూరిస్టులను రప్పించి, నాటకాలతో ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చినట్టే, నేడు కూడా అదే అబద్ధాల వరద పారిస్తున్నారని చెప్పారు.

**సిరిసిల్లలో కబ్జా భూములనడం దుర్మార్గం** సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు, కార్మికులకు దశాబ్దాల క్రితం ఇచ్చిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జా భూములుగా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమని కేటీఆర్ విమర్శించారు.

# అడ్డంగా దొరికిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

కెసిఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు భూస్వామ్య కుటుంబంలో జన్మించారంటూ బిఆర్ఎస్ పార్టీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి కౌంటర్ ఇచ్చారు. గతంలో కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్ ను ఎక్స్‌లో షేర్ చేస్తూ తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత అధికారంలో ఉన్న పదేళ్లలో కెసిఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం,కెసిఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ల ద్వారా స్పష్టమవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమకారులకు అప్పులు మిగిలితే కెసిఆర్ కుటుంబానికి మాత్రం లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి నిలదీశారు. ఇదంతా ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా అని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద కల్వకుంట్ల కుటుంబం లక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదించుకుంటే డ్రామారావు (కెటిఆర్) మాత్రం పుట్టుకతోనే కెసిఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. మరీ కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పులు రాసి మోసం చేసారా? లేక, ప్రజలకు అబద్దాలు చెబుతున్నారా అని మంత్రి పొంగులేటి నిలదీశారు.ఎన్నికల అఫిడవిట్‌లో ఎకరం భూమినే కెటిఆర్ చూపించారు ఏళ్ల తరబడి కెటిఆర్ తన అమెరికా సక్సెస్ గురించి గొప్పలు చెప్పుకుంటూ చిన్నప్పటి నుంచే తనకు వందల ఎకరాల భూములు ఉన్నాయని చెప్పుకున్నారని, కానీ, ఆయన స్వయంగా దాఖలు చేసిన 2009 ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం అసలు నిజాన్ని చెబుతోందని మంత్రి పొంగులేటి ఎద్దేవా చేశారు. మరీ కెటిఆర్‌కు ఒక ఎకరం ఉన్న భూమి, వందల ఎకరాలుగా, వేల కోట్ల విలువైన భూములుగా ఎలా మారాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కుటుం బ పాలనలో అక్రమంగా ఆస్తులను కూడబెట్టుకున్న కెటిఆర్ ఇప్పుడు తెలంగాణకు నీతులు చెబుతున్నారని, దెయ్యాలు వేదాలు వల్లిస్తే ఇంతకంటే నమ్మశక్యంగా ఉండేదని ఆయన పేర్కొన్నారు.

## డిసెంబర్ నుంచి 'హార్వర్డ్' కోర్సులు

**హైదరాబాద్:సెప్టెంబర్ 17 :** ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఔత్సాహికుల కోసం ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అం దించనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా రా ష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో ఆయన పేర్కొన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. వివిధ యూకే బిజినెస్ స్కూల్స్‌కు సంబంధిం చిన డీన్‌లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వ విద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్‌రెడ్డి వారితో తెలిపారు.

# సెమీకండక్టర్ రంగంలో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమీకండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోడీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ ఇండియా-2026 ఈవెంట్ సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలో కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నాయి. కాగా ప్రధాని మోడీ 76 వ ఏట అడుగుపెట్టడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సహా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

# వచ్చేనెల 1న కృష్ణా బోర్డు సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వాటాల పంపిణీపై కృష్ణా బోర్డు సమావేశం నిర్వహించనుంది. వచ్చేనెల 01వ తేదీన 21వ కృష్ణాబోర్డు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల అధికారులకు సమాచారం అందించింది. ఈ మీటింగులో నీటి వాటాలతో పాటు వివిధ ప్రాజెక్టులపై చర్చించే అవకాశం ఉంది. ఎల్ నినో నేపథ్యంలో ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీటిని కేవలం తాగునీటికే వాడుకోవాలని ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. ఈ నెల 4న త్రీమెంబర్ కమిటీ మీటింగ్‌లో 50:50 నిష్పత్తిలో నీళ్లను పంచాలని మన రాష్ట్రం డిమాండ్ చేయగా ఎపి ఎప్పటిలాగానే 66:34 రేషియోలో పంచాలని సూచించింది.

# పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఓటర్ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్,సెప్టెంబర్ 17 :** రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ విడుదలైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు హైదరాబాద్-రంగారెడ్డి, వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితా షెడ్యూల్‌పై తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవి కాలం మార్చి 2027 నాటికి ముగియనుందని తెలిపారు. 2026 నవంబర్ 1ని ఓటరు నమోదుకు అర్హత తేదీగా పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుందనీ, నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుందని తెలిపారు. డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నామని తెలిపారు. గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఫారం-18తో పాటు ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు సీఈఓ తెలంగాణ వెబ్‌సైట్‌లో అవకాశం ఉందని చెప్పారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, డిజిగ్నేటెడ్ అధికారుల వద్ద ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే పోస్టు ద్వారా కూడా ఫారం-18 దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు.

**ఓటర్ షెడ్యూల్ వివరాలు...** 1). సెప్టెంబర్ 28న ఓటర్ల నమోదు ప్రక్రియకు నోటిఫికేషన్ 2). నవంబర్ 1, 2026 అర్హత తేదీగా ఓటర్ల జాబితా తయారీ 3).నవంబర్ 6 వరకు ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ 4).నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల 5).నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ 6). డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

# కేసీఆర్ కుటుంబ ఆస్తులపై విచారణ జరగాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. 2004, 2009 ఎన్నికల అఫిడవిట్లలో కేసీఆర్‌కు భూములు లేవని పేర్కొన్నారని, కానీ 2014 నాటికి 35 ఎకరాలు, 2018లో మరింత పెరిగి, 2023 నాటికి 53 ఎకరాలు ఉన్నట్లు చూపించారని వివరించారు. 2023 నాటికి కేటీఆర్ కుటుంబ పేరిట 123 ఎకరాలు వచ్చాయని, 2026 నాటికి కేటీఆర్ 67 ఎకరాలు కొనుగోలు చేశారని తెలిపారు. సమర్పించిన అఫిడవిట్లకు, అసలు ఆస్తులకు ఎక్కడా పొంతన లేదని, తెలంగాణలో గజం భూమి లేని పేదలు ఎందరో ఉండగా కేసీఆర్ కుటుంబానికి ఇన్ని భూములు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద ఉన్న భూములపై కచ్చితంగా సమగ్ర విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. తాము వారిని బదనామ్ (ప్రతిష్ట దిగజార్చడం) చేయడానికి ఈ విషయాలు మాట్లాడటం లేదని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన తర్వాత రాష్ట్రంలోని దళితులు, బీసీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని అన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ తనది కాదని కేటీఆర్ అంటున్నారని, కానీ ఆయన అక్కడే ఉంటున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపించారు. అయితే, ప్రభుత్వం ఎవరి ప్రైవేట్ ఆస్తులను లాక్కునే ఉద్దేశంతో లేదని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితా విషయంలో ఎక్కడో ఒకచోట అధికారుల తప్పిదం ఉండి ఉండవచ్చని, దానిపై కూడా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ నిబంధనను ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ తమ స్వార్థం కోసం పెట్టలేదని స్పష్టం చేశారు. స్పీకర్ తల్లిపై బీఆర్ఎస్ నేతలు వాడిన భాష ఏమాత్రం మంచిది కాదని హితవు పలికారు. పోలీసుల పట్ల బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించిన తీరును తప్పుబట్టారు. గతంలో కేసీఆర్ ఢిల్లీలో ఉన్న ఇంటికి, ప్రగతి భవన్‌కు బుల్లెట్ ప్రూఫ్ తలుపులు ఏర్పాటు చేసుకున్న తీరును గుర్తుచేశారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని, గతంలో పనిచేసిన ఇంచార్జ్‌లు కూడా బాగానే పనిచేశారని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ కొనియాడారు.

# నా దేవాలయ సందర్శనను వక్రీకరించారు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలను, పత్రికల్లో వచ్చిన ప్రకటనలను పెన్‌డ్రైవ్‌ల ద్వారా న్యాయమూర్తికి అందజేశారు. గత నెలలో కుటుంబ సభ్యులతో కలిసి హరీశ్‌రావు కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా దేవి ఆలయాన్ని సందర్శించుకున్న విషయం తెలిసిందే. ఈ ఆధ్యాత్మిక పర్యటనను కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో వర్షాలు పడకూడదని కోరుకుంటూ క్షుద్రపూజలు చేశారంటూ మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌లు గాంధీ భవన్ వేదికగా, మీడియాతోపాటు సోషల్ మీడియాలో పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు, కేవలం రాజకీయ దురుద్దేశంతో వ్యక్తి వ్యక్తిత్వాన్ని, ఆయన విశ్వాసాలను కించపరిచేలా వ్యవహరించడాన్ని తీవ్రంగా పరిగణించామని తెలిపారు. పూజలను కూడా రాజకీయ బురద చల్లడానికి వాడుకోవడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కల్పిత ఆరోపణలపై గత నెలలోనే తన న్యాయవాదుల ద్వారా ఆ ఇద్దరు నేతలకు లీగల్ నోటీసులు పంపామని తెలిపారు. తాము చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆ నోటీసుల్లో డిమాండ్ చేశామని పేర్కొన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్‌కు వచ్చిన నోటీసును కనీసం తీసుకోకుండా ఉద్దేశపూర్వ కంగా తిరస్కరించారనీ, అద్దంకి దయాకర్ వ్యాఖ్యలను సమర్థించుకుంటూ పొంతన లేని సమాధానం ఇచ్చారని వివరించారు. వారు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకునే అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేదనీ, న్యాయస్థానం ద్వారానే తగిన గుణపాఠం చెప్పించాలనే ఉద్దేశంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు.

# డీజీపీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు





హైదరాబాద్,క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)
ప్రజాపాలన దినోత్సవ వేడుకలను డీజీపీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీ గజరావు భూపాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో ఏఐజీ (లీగల్) రమణకుమార్, ఏఐజీ (అడ్మిన్) జె. అన్యోన్య, ఎస్పీ (లీగల్) సతీష్, పేషీ డీఎస్పీ భాస్కర్, స్టోర్స్ డీఎస్పీ సత్యనారాయణ, సీఎస్ఓ యోగేశ్వరరావుతో పాటు ఏవోలు, సూపరింటెండెంట్లు, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధే ప్రజాపాలనకు ప్రధాన లక్ష్యం

## - సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్






సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)
ప్రజల సంక్షేమం, భద్రత, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడమే ప్రజాపాలనలో కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడమే ప్రజాపాలన ప్రధాన ఉద్దేశమని సీపీ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికలు, వృద్ధులు, వలస కార్మికుల భద్రతకు సైబరాబాద్ పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ప్రజలు--పోలీసుల మధ్య పరస్పర నమ్మకం, సహకారం మరింత బలోపేతం అయినప్పుడే సురక్షితమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమని సీపీ అన్నారు. సైబరాబాద్ పోలీస్ శాఖ ప్రజా సేవలో నిరంతరం అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అడిషనల్ డీసీపీ షమీర్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రూ.5 లక్షల లంచం తీసుకుంటూ ఎస్ఐ అరెస్ట్

● కీసర పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ బెయిల్, వేధింపులు లేకుండా చూసేందుకు లంచం డిమాండ్.. ఏసీబీ వలలో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ




మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)
కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తున్న కీసర పోలీస్ స్టేషన్ ఎస్ఐను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఉన్న ఇన్‌స్పెక్టర్‌ను కూడా నిందితుడిగా చేర్చినట్లు ఏసీబీ వెల్లడించింది.ఏసీబీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. మల్కాజిగిరి జోన్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఏఓ-1) అర్కపల్లి అంజనేయులు సూచనల మేరకు సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఓ-2) ద్యాప గ్నానేందర్ రెడ్డి వ్యవహరించినట్లు పేర్కొంది.కేసులో ఫిర్యాదుదారుడు, అతని స్నేహితుడికి స్టేషన్ బెయిల్ ఇప్పించడంతో పాటు వేధింపులు లేకుండా చూస్తామంటూ రూ.5 లక్షల లంచాన్ని డిమాండ్ చేసి స్వీకరించిన సమయంలో ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు ఎస్ఐను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.5 లక్షల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ తెలిపింది.ఇద్దరు అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుండా అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ ప్రకటనలో పేర్కొంది.అనంతరం ఏఓ-1 అర్కపల్లి అంజనేయులు, ఏఓ-2 ద్యాప గ్నానేందర్ రెడ్డిలను నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

**లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు.**

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలకు సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపింది.

# గాజులరామారంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు

●వీర తెలంగాణ యోధుల త్యాగాలను స్మరించుకున్న బీజేపీ నాయకులు





కుత్బుల్లాపూర్: సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)
ఉమ్మడి గాజులరామారం డివిజన్ పరిధిలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రోడ మేస్త్రి నగర్‌లో బీజేపీ సీనియర్ నాయకులు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో, లెనిన్ నగర్‌లో లక్ష్మణ్, ధర్మేష్ ఆధ్వర్యంలో, చంద్రగిరి నగర్ చౌరస్తాలో డివిజన్ సీనియర్ నాయకులు సాయి ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీర యోధులకు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సాయినాథ్ నేత మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, స్వేచ్ఛ కోసం ప్రాణత్యాగం చేసిన తెలంగాణ యోధుల త్యాగాలను స్మరించుకోవాలని అన్నారు. వారి ధైర్యం, పోరాట స్ఫూర్తి, త్యాగాలను భావితరాలకు అందిస్తూ స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.కార్యక్రమాల్లో నారాయణపేట జిల్లా ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ భానుచందర్, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు సునీల్ పాటిల్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మాజీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి, గాజులరామారం డివిజన్ కార్యదర్శి జి. శ్రీనివాస్, సీనియర్ నాయకులు నరేష్ గౌడ్, వసుంధర, యువ మోర్చా ఉపాధ్యక్షులు ధర్మేష్, లక్ష్మణ్, పులి రాజు, నాగరాజు చారి, లక్ష్మణ్ గౌడ్, రాజేష్ కన్నా, మురళి గౌడ్, అమర్, బాలరాజు, అశోక్, బాలు నేత తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో ఘనంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వేడుకలు

## - అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల ధైర్యసాహసాలు, త్యాగాలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట బస్టాండ్ ప్రాంతంలో మహా ఆది జాంబవ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.కమిటీ అధ్యక్షుడు ఎర్ర యాకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ కామ్రేడ్ యేసు రత్నం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల సేవలు, త్యాగాలను స్మరించుకుని నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వారి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు డప్పు రామస్వామి, ఆల్వాల్ భాస్కర్, రంగాపురం సోమన్న, తొండ వెంకట్, ఎర్ర సైదులు, రమేష్, జోగు ఉపేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాములు, పోతరాజు సోమన్న, వీరాస్వామి, ప్రవీణ్, వెంకటాచారి, ఇమామ్, చారి, కృష్ణ, కీర్తి, నర్సయ్య, విజయ్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేళ డీజే, బ్యాండ్ నిర్వాహకులతో పోలీసుల సమావేశం

శబ్ద కాలుష్యానికి తావివ్వొద్దు.. నిబంధనలు, సమయపాలన తప్పనిసరి





సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)
వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జీడిమెట్ల పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని డీజే నిర్వాహకులు, బ్యాండ్ యజమానులు, సౌండ్ సిస్టమ్ షాపుల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పండుగ వేడుకల్లో అధిక శబ్దాన్ని ఉత్పత్తి చేసే డీజేలు, బ్యాండ్లు, ఇతర సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై పోలీసులు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ నిర్దేశించిన నిబంధనలు, సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల కారణంగా సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా చూడాలని, శబ్ద కాలుష్యానికి తావివ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సౌహార్దపూర్వక వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖకు నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కోరారు.నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేసినట్లు సమాచారం. పండుగ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని జీడిమెట్ల పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# కమ్యూనిస్టుల తెలంగాణ విముక్తి చరిత్రను ఎవరూ మార్చలేరు

## -- సీపీఐ నాయకులు రమేష్, శ్రీరామ్

వనపర్తి: సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం కమ్యూనిస్టులు సాగించిన సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఎవరూ మార్చలేరని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట యోధులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మొయినుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సోయబుల్లాఖాన్ తదితరుల చిత్రపటాలకు సీపీఐ మాజీ సర్పంచ్ కళావతమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందన్నారు. నిజాం రజాకార్లు, భూస్వాములు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడారని పేర్కొన్నారు. ఈ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం అధికారికంగా కార్యక్రమాలు నిర్వహించాలని, నాటి పోరాట చరిత్రను




విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో చేర్చి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని కోరారు. అమరుల పోరాట స్ఫూర్తితో శ్రమజీవుల అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్, గోపాలకృష్ణ, నాయకులు పృధ్వినాదం, చిన్న కురుమన్న, శేఖర్, మహేష్, వంశీ, శిరీష, జ్యోతి, శ్రీదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ఘనంగా నిర్వహణ

## ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



మేడ్చల్--మల్కాజ్‌గిరి: సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. స్వేచ్ఛ, హక్కులు, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువల కోసం జరిగిన పోరాటాలను, అమరవీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజల భాగస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, బాధ్యతాయుతమైన ప్రజా పాలన ప్రాధాన్యతను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది నాగవేణి, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు. జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించి దేశ సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేసిన పాఠకులు, సిబ్బంది, సంబంధిత ప్రతి ఒక్కరికీ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

## - జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు











మేడ్చల్--మల్కాజిగిరి: సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించిన కేశవరావు అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి తదితరులు ప్రభుత్వ సలహాదారుకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం అనేక మంది మహనీయులు చేసిన అసమాన త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని అన్నారు. వారి పోరాట స్ఫూర్తితో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాను అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు అందించడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, రేషన్ కార్డుల పంపిణీ, అభయహస్తం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరా మహిళా శక్తి, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా, మహిళలు, చిన్నారుల భద్రత కోసం టీ-సేఫ్ యాప్ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తూ సంక్షేమం, సమతుల్య అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని కేశవరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిటీ సభ్యుడు జైపాల్ రెడ్డి, డీఆర్వో మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి కమిషనరేట్‌లో ఘనంగా హైదరాబాద్ విమోచన దినోత్సవం

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన డీసీపీ పి. ఇందిర





మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17న మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ సీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) పి. ఇందిర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో జాతీయ పతాకానికి గౌరవం సమర్పించారు. దేశభక్తి, ఐక్యత, ప్రజాసేవ స్ఫూర్తిని చాటుతూ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

# రూ.2.50 లక్షల లంచం డిమాండ్.. ఏసీబీ వలలో ముగ్గురు

### రూ.1 లక్ష లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో రూ.2.50 లక్షల లంచం డిమాండ్ చేసి, అందులో రూ.1 లక్ష స్వీకరిస్తుండగా ఇద్దరు ట్రెజరీ అధికారులు, ఒక ప్రైవేట్ వ్యక్తి ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. చేవెళ్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారి మాదిగ లక్ష్మయ్య (ఆూా-1), అసిస్టెంట్ ట్రెజరీ అధికారి కావలి అనురాధ (ఆూా-2) కలిసి ఫిర్యాదుదారుడి నుంచి రూ.2.50 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడి సస్పెన్షన్ కాలానికి సంబంధించిన రూ.23,25,390 జీతం బిల్లులు, పదవీ విరమణ అనంతర పెన్షన్ సర్దుబాటు బకాయిలు రూ.4,29,000 ప్రాసెస్ చేసి ఫార్వర్డ్ చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. పాక్షిక చెల్లింపులో భాగంగా ఆూా-1 తన వాటాగా రూ.50 వేలు స్వీకరించగా, ఆూా-2 ఆదేశాల మేరకు వడ్డే జంగయ్య అలియాస్ చిన్నా అనే ప్రైవేట్ వ్యక్తి మరో రూ.50 వేలు స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది. ఈ సమయంలో రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులు దాడి చేసి



ముగ్గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.1 లక్ష కలుషిత లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను సక్రమంగా, నిజాయితీగా నిర్వర్తించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ వెల్లడించింది. పట్టుబడిన ముగ్గురినీ నాంపల్లిలోని ూాజు ఒ ాజదీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ పేర్కొంది. లంచం అడిగితే 1064కు ఫిర్యాదుఏ ప్రభుత్వ అధికారి లంచం డిమాండ్ చేసినా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని అధికారులు సూచించారు. వాట్సాప్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ వెల్లడించింది.

# భక్తి--దేశభక్తి కలయికే వినాయక చవితి

## - గణేష్ మండపాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గణేష్ మండపాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించి హైదరాబాద్ సంస్థాన విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పిలుపు మేరకు నియోజకవర్గంలోని సుమారు 50 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ మండపాల వద్ద జాతీయ జెండాను ఎగురవేసి, సంపూర్ణ వందేమాతరం ఆలాపనతో దేశభక్తిని చాటారు. నిజాం పాలన, రజాకారుల దమనకాండకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భక్తితో పాటు దేశభక్తిని పెంపొందించడమే వినాయక చవితి ఉత్సవాల స్ఫూర్తి అని నిర్వాహకులు పేర్కొన్నారు. సూరారం ప్రాంతంలో కంది శ్రీరాములు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి వందేమాతరం ఆలాపనతో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల సతీష్, కో-కన్వీనర్లు నల్ల జైశంకర్ గౌడ్, బలరాం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో మల్కాజిగిరి సీపీ సుమతి

● పరేడ్ గ్రౌండ్స్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు ఘన స్వాగతం


















**మల్కాజిగిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సీపీ బి. సుమతితో పాటు సీఆర్‌పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్, సీఆర్‌పీఎఫ్ సదరన్ జోన్ ఏడీజీ రవిదీప్ సింగ్ సాహి, సీనియర్ పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేడుకల్లో సీఆర్‌పీఎఫ్ బలగాల క్రమశిక్షణతో కూడిన పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తం 10 ప్లాటూన్లు క్రమబద్ధమైన వరుసల్లో కవాతు నిర్వహించాయి. పరేడ్‌కు ఒక బ్రాస్ బ్యాండ్, ఒక పైప్ బ్యాండ్ బృందాలు సంగీతాన్ని అందించాయి. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రదర్శించిన క్రమశిక్షణ, సమన్వయం, దేశభక్తి కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకువచ్చాయి. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేసుకుంటూ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశభక్తి, జాతీయ ఐక్యత, సమగ్రత, ప్రజాసేవ వంటి విలువలను ప్రతిబింబించేలా కార్యక్రమం సాగింది. ఈ వేడుకలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. పోలీస్, సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం దేశభక్తి, జాతీయ సమైక్యత, ప్రజాసేవ స్ఫూర్తిని చాటేలా సాగింది.

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

## రూ.10 వేల జరిమానా విధించిన భువనగిరి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు



**మల్కాజిగిరి కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ భువనగిరి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. తుర్కపల్లి పోలీసుల వివరాల ప్రకారం.. 2021 అక్టోబర్ 31న సాయంత్రం సుమారు రెండేళ్ల వయస్సున్న బాలిక పొరుగింటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత బాలిక ఏడుపు వినిపించడంతో తల్లి అక్కడికి వెళ్లి చూడగా, నిందితుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో బాలిక తల్లి 2021 నవంబర్ 1న తుర్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఖీ×= నంబర్ 138/2021 కింద ఖూజ 376–ూదీ, పోక్సో చట్టంలోని సెక్షన్ 4 కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో పోలీసులు సంబంధిత సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కేసు భువనగిరి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టులో ూజ నంబర్ 138/2022గా విచారణకు వచ్చింది. కేసులో సమర్పించిన సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడు ధీరావత్ నవీన్, తండ్రి భీక్య, వయస్సు 25 సంవత్సరాలు, పెద్ద తండా నివాసిని దోషిగా నిర్ధారించింది. అతనికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు దర్యాప్తు, న్యాయస్థానంలో సాక్ష్యాధారాల సమర్పణలో తుర్కపల్లి పోలీసులు కీలకంగా వ్యవహరించారు.

# సూరారంలో వ్యక్తి మృతి

## - ఆరోగ్య సమస్యలతో లేఖ రాసినట్లు పోలీసుల ప్రాథమిక సమాచారం

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం నివాసి పూజిత (30) ఈరోజు తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త మధ్య అశోక్ (46) గతంలో 2022లో బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. వీరికి సుమారు 23 ఏళ్ల క్రితం వివాహం జరిగినట్లు పేర్కొన్నారు. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు భోజనం అనంతరం నిద్రకు వెళ్లారు. రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో పూజిత నిద్రలేచి చూడగా అశోక్ ఇంటి బయట మృతి చెందిన స్థితిలో కనిపించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద లభించిన లేఖలో తన ఆరోగ్య సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. సమాచారం అందుకున్న సూరారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వైద్య పరీక్షల నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రామగుండం చీఫ్రాజ లో భక్తిశ్రద్ధలతో శ్రీ విశ్వకర్మ పూజ



**రామగుండం : సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
రామగుండం చీఫ్రాజ తెలంగాణ ప్రాజెక్టు ప్రాంగణంలో శ్రీ విశ్వకర్మ పూజోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు.?ఈ పూజా కార్యక్రమంలో చీఫ్రాజ ఉన్నతాధికారులు, సీనియర్ ప్రముఖులు, ఉద్యోగులు, కార్మికులు మరియు కాంట్రాక్టు కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీ విశ్వకర్మ స్వామివారి దివ్య ఆశీస్సులతో ఉద్యోగులందరికీ సుఖసంతోషాలు, సమృద్ధి, భద్రత కలగాలని... అలాగే ప్రతి ఒక్కరూ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పూజ అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పాత భవనంపై మరో అంతస్తు.. కమర్షియల్ షట్టర్ల నిర్మాణం!




● గాజులరామారం సర్కిల్--57లో టౌన్ ప్లానింగ్ నిఘా ఎక్కడ?

● అనుమతులు ఉన్నాయా? అక్రమ నిర్మాణమైతే చర్యలు ఎప్పుడు?

అధికారుల తీరుపై స్థానికుల ప్రశ్నలు






**కుత్బుల్లాపూర్ : సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
గాజులరామారం సర్కిల్--57 పరిధిలోని రోడా మేస్త్రి నగర్ ప్రాంతంలో భవన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బిస్మిల్లా హోటల్ భవనంపై ఇప్పటికే ఉన్న నిర్మాణానికి పైభాగంలో మరో అంతస్తు నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా ఆ అంతస్తులో కమర్షియల్ షట్టర్లతో నిర్మాణం చేపట్టడం చర్చనీయాం శంగా మారింది. స్థలంలో కనిపిస్తున్న నిర్మాణ పరిస్థితులను బట్టి అదనపు అంతస్తు నిర్మాణానికి సంబంధించి సిఎంసి నుంచి అనుమతులు ఉన్నాయా? భవనానికి మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మాణం జరుగుతోం దా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. అనుమతులు లేకుండా అదనపు అంతస్తు లేదా వాణిజ్య నిర్మాణం చేపట్టినట్లయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ అధికారులపై ఉంది. అయితే నిర్మాణం అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ చర్యలు కనిపించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? లేక సంబంధిత నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయా? అన్నది అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేకుంటే వెంటనే నిర్మాణాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణదారులకు నిబంధనలు ఒకలా.. అధికారులకు మరోలా అన్న పరిస్థితి ఏర్పడకూడదని వారు అంటున్నారు. ఈ వ్యవహారంపై గాజులరామారం సర్కిల్--57 టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్):**
శ్రీ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని గురువారం ఎన్‌టీపీసీ కార్మిక సంఘం కార్యాలయంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయ ఆవరణలో నాయకులు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శ్రీ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమం, ఐక్యత, హక్కుల సాధనతో పాటు పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సాగర్ రాజ్, భాస్కర్ రెడ్డి, కొమురయ్య, మహేష్, నరసింహ రెడ్డి, రాయమల్లు, సత్యనారాయణరెడ్డిలతో పాటు పలువురు యూనియన్ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని పరస్పరం జయంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**మద్యం విషయంలో గొడవ.. నైలాన్ తాడుతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి**



**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)** నాదర్‌గుల్‌లో మహిళ హత్య కేసును ఆదిభట్ల పోలీసులు ఛేదించారు. మృతురాలితో సహజీవనం చేస్తున్న వ్యక్తే ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో నిందితుడు దాసరి నరసింహమూర్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం.. నాదర్‌గుల్ శ్రీపురం కాలనీలో కొర్రపాటి కళ్యాణి అనే మహిళ హత్యకు గురైన ఘటనపై సెప్టెంబర్ 15న ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో కళ్యాణితో దాసరి నరసింహమూర్తి సహజీవనం చేస్తున్నట్లు, మద్యం సేవించే విషయంలో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని పోలీసులు గుర్తించారు.సెప్టెంబర్ 13 రాత్రి జరిగిన గొడవలో నరసింహమూర్తి కళ్యాణి మెడకు నైలాన్ తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఈ ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు సంఘటనా స్థలంలోని ఆధారాలను మార్చే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. మృతురాలి ఫోన్ ద్వారా ఆమె భర్తతో పాటు ఇతరులకు తప్పుడు సమాచారం పంపి అక్కడి నుంచి నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఫిర్యాదు మేరకు ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 759/2026, బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు దాసరి నరసింహమూర్తిని సెప్టెంబర్ 17న ఉదయం 11 గంటలకు నాదర్‌గుల్‌లో దర్యాప్తు అధికారి, ఆదిభట్ల ఎస్‌హెచ్‌ఓ ఎస్. రమేశ్ తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయపరమైన చర్యల నిమిత్తం రిమాండ్‌కు తరలించారు.కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌ఓ ఎస్. రమేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటేశ్, నోయల్ రాజ్, క్రైమ్ సిబ్బంది పి. ఎల్లయ్య, సంతోష్ కుమార్, ఎం.డి. సంతోష్, శివచంద్ర, సందీప్, టి. ఉపేందర్ రెడ్డిలను శంషాబాద్ డీసీపీ అభినందించారు.

# వినాయక మండపాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన

**మండపాలను సందర్శించిన పోలీసు అధికారులు.. నిర్వాహకులకు పలు సూచనలు**





**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిత్రమ వర్గాల నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పోలీసు అధికారులు సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏసీపీ బాల గంగిరెడ్డితో కలిసి ఏడీసీపీ పురుషోత్తం మండపాలను సందర్శించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు, భద్రతా చర్యలను సమీక్షించారు. విగ్రహాల నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు.ముఖ్యంగా సౌండ్ సిస్టమ్‌లను నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని, అధిక శబ్దంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు శాఖకు సహకరించాలని నిర్వాహకులను కోరారు.వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె. రవికుమార్, ఎస్ఐ ఆర్. ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక వివాదంతో కత్తితో దాడి.. వ్యక్తి హత్య

**చిలకల్గూడ పోలీసులు కేసును ఛేదించి నిందితుడి అరెస్ట్**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)** సికింద్రాబాద్ జోన్ పరిధిలోని చిలకల్గూడ మైలార్‌గడ్డలో జరిగిన వ్యక్తి హత్య కేసును చిలకల్గూడ పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మహమ్మద్ నిజాముద్దీన్ అలియాస్ నిజాం (36)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై చిలకల్గూడ పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.459/2026, దీచీూ సెక్షన్ 103(1) కింద కేసు నమోదైంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 15న మృతుడు ఇమ్మడి శ్రీనివాస్ సాయంత్రం 6 నుంచి 6.30 గంటల మధ్య తన ఇంటి నుంచి ూష్ణీఙఖ వాహనంపై సమీపంలోని వైన్‌షాప్‌కు వెళ్లాడు. రాత్రి 7.10 నుంచి 7.20 గంటల సమయంలో మైలార్‌గడ్డ రోడ్డుపై నిజాముద్దీన్ అతనిపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను తొలుత ఆర్టీసీ ఆసుపత్రికి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

**డబ్బు వివాదమే కారణం**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. నిందితుడు నిజాముద్దీన్‌కు మృతుడి కుమారుడు సుమన్‌తో పరిచయం ఉండటంతో పాటు వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు వెల్లడైంది. షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో



నష్టాలు రావడంతో సుమన్ అప్పులపాలై 2023 నవంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. తనకు రావాల్సిన డబ్బును తిరిగి చెల్లించాలని నిజాముద్దీన్ డిమాండ్ చేయడంతో పాటు, ఈ ఆర్థిక వివాదానికి సంబంధించి సివిల్ కేసు కూడా దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో మృతుడు శ్రీనివాస్‌పై నిజాముద్దీన్ దాడి చేసినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. నిందితుడిని సెప్టెంబర్ 16న అరెస్ట్ చేశారు.

**ఆయుధం, దుస్తులు, స్కూటర్ స్వాధీనం**

నిందితుడి నుంచి నేరానికి ఉపయోగించిన పదునైన వంకర కత్తి, రక్తపు మరకలు ఉన్న దుస్తులు, ఒక ూజూ చీూూ స్కూటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.చిలకల్గూడ ూఙూ కె. శశాంక్ రెడ్డి పర్యవేక్షణలో, సికింద్రాబాద్ జోన్ అదనపు ఖజూ జె. నర్సయ్య నాయకత్వంలో చిలకల్గూడ పోలీస్ స్టేషన్ ూఝూ వి. రామకృష్ణ, ూ× జె. రాకేష్, పోలీసు సిబ్బంది వేగంగా స్పందించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వారి కృషిని సికింద్రాబాద్ జోన్ రక్షిత కృష్ణమూర్తి, ఞూ అభినందించారు.

**వివాదాలను చట్టబద్ధంగానే పరిష్కరించుకోవాలి**

అప్పులు, ఆర్థిక లావాదేవీలు లేదా ఇతర వ్యక్తిగత వివాదాలు ఉన్నవారు పోలీస్ స్టేషన్, న్యాయస్థానం లేదా సంబంధిత చట్టబద్ధ సంస్థలను ఆశ్రయించాలని హైదరాబాద్ సిటీ పోలీసులు సూచించారు. డబ్బు వసూలు లేదా వ్యక్తిగత వివాదాల పరిష్కారం పేరుతో బెదిరింపులు, దాడులు, హింసకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదని స్పష్టం చేశారు.

# సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో అరాచక శక్తులను గద్దె దించుతాం

**- సెప్టెంబర్ 17 పోరాటంపై కాంగ్రెస్, బీజేపీ ప్రచారం వాస్తవ విరుద్ధం: కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో నేటి అరాచక శక్తులను ఎదుర్కొంటామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు.సెప్టెంబర్ 17 తెలంగాణ పోరుపాటికి, పోరాట పటిమకు, అమరుల త్యాగాల చరిత్రకు నిదర్శనమని కవిత పేర్కొన్నారు. ఆనాటి జాగీర్దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటాన్ని విలీన దినోత్సవం గుర్తు చేస్తుందని అన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విషయంలో కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని కవిత ఆరోపించారు. ప్రజలపై జరిగిన అన్యాయాలు, దాష్టీకాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలే తిరుగుబాటు చేసి పోరాడారని, ఈ పోరాటంలో కాంగ్రెస్, బీజేపీలకు పాత్ర లేదని ఆమె పేర్కొన్నారు.నిజాం పాలన నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ రైతాంగ పోరాటాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఈ పోరాటాన్ని మతపరమైన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలు



జరుగుతున్నాయని ఆమె విమర్శించారు. పోరాటం జరిగిన కాలంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉనికిలోనే లేవని పేర్కొన్నారు.

**ప్రజలే ఎదురొడ్డి పోరాటం చేశారు**

జమీందార్లు, జాగీర్దార్ల దాష్టీకాలు, అన్యాయాలు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ప్రజలే సంఘటితమై పోరాడారని కవిత అన్నారు. ఈ పోరాటంలో హిందువులు, ముస్లింలు కలిసి పాల్గొన్నారని గుర్తు చేశారు.పట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి మేధావులు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని చెప్పారు. ఆంధ్ర మహాసభ ద్వారా ప్రజలను సంఘటితం చేశారని పేర్కొన్నారు. కాళోజీ, దాశరథి, షోయబుల్లాఖాన్, మగ్దూం మొహియుద్దీన్ వంటి ప్రముఖుల రచనలు, ఉద్యమాలు ప్రజల్లో పోరాట స్ఫూర్తిని పెంపొందించాయని తెలిపారు.దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి తదితరులు ప్రజా పోరాటాలకు ప్రతీకలుగా నిలిచారని కవిత పేర్కొన్నారు.

**ప్రజల హక్కుల రక్షణే లక్ష్యం**

నేటి తెలంగాణలో ప్రజల హక్కుల కోసం పోరాడేందుకు తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత తెలిపారు. మతం, కులం, పేద, ధనిక అనే తేడాలు లేకుండా ప్రజల హక్కుల రక్షణకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. తెలంగాణ ప్రజలకు తమను తాము ఎలా కాపాడుకోవాలో తెలుసని ఆమె పేర్కొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

**- రూ.16 వేల జరిమానా విధించిన నాంపల్లి కోర్టు**

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)** హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు మొత్తం రూ.16 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని ×ఙ అదనపు సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది.ఎస్.ఆర్.నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో నమోదైన క్రైమ్ నంబర్ 110/2020కు సంబంధించిన సెషన్స్ కేసు (ూజ.చీ.282/2021)లో నాంపల్లి ×ఙ అదనపు సెషన్స్ న్యాయమూర్తి జె. విక్రమ్ గురువారం తీర్పు ప్రకటించారు. నిందితుడు ముడే రాజు నాయక్ (37)పై ఖూజ సెక్షన్లు 302, 379, 201 కింద నేరం రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది.

**ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాని రమేష్**

పోలీసుల వివరాల ప్రకారం.. వికాస్‌పురి కాలనీ, ఏజీ కాలనీ సమీపంలో నివసించే పి. ప్రదీప్ 2020 ఫిబ్రవరి 2న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తండ్రి పి. రమేష్ (50) ఫిబ్రవరి 1న సాయంత్రం 6.30 గంటల సమయంలో బోరబండకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.అదే రోజు రాత్రి 8.30 గంటలకు రమేష్ స్నేహితుడు సాయి ఫోన్ చేయగా తాను స్నేహితుడి ఇంట్లో



ఉన్నానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు రమేష్ ఫోన్ నంబర్ నుంచి ఆయన కోడలికి వాట్సాప్ సందేశం వచ్చింది. అనంతరం ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో పాటు ఫోన్ స్విచ్‌ఆఫ్ అయింది.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన శాస్త్రీయ ఆధారాల ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కేసు విచారణలో పోలీసుల తరఫున సమర్పించిన ఆధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది.

**పోలీసు బృందానికి అభినందనలు**

కేసు దర్యాప్తు అధికారులుగా ఎస్. మురళీకృష్ణ, వి. నరసింహారెడ్డి వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీవాణి పోలీసుల తరఫున వాదనలు వినిపించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ మన్నాటి బలరామ్, ప్రాసెస్ డ్యూటీ బి. కృపేంద్ర తదితరులు కేసు ప్రక్రియలో సహకరించారు.కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని శాస్త్రీయ ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్థంగా సమర్పించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సేవలను పోలీసు అధికారులు అభినందించారు.

# ప్రజా పాలన దినోత్సవం.. ప్రజాస్వామ్యానికి ప్రతీక

**యాదగిరిగుట్ట సెప్టెంబర్ 17** యాదగిరిగుట్ట పురపాలక కార్యాలయంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా జాతీయ పతాక ఆవిష్కరణ గౌరవ చైర్మన్ గుండ్ల పెల్లి వాని భరత్ గౌడ్, ఆధ్వర్యంలో జరిగినది గౌర చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన సెప్టెంబర్ 17ను తెలంగాణలో ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ రోజు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది.1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా కొనసాగించాలని ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రయత్నించారు. ఖాసీం రజ్వీ నేతృత్వంలోని రజాకార్ల దాడులు, వెట్టిచాకిరి, భూదోపిడీ, అణచివేతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న ఆపరేషన్ పోలోను ప్రారంభించింది. మేజర్ జనరల్ జయంతో నాథ్ చౌదరి నేతృత్వంలోని భారత సైన్యం చర్యలతో నిజాం సెప్టెంబర్ 17న కాల్పుల విరమణ ప్రకటించారు. అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది.ఈ చారిత్రక పరిణామంతో రాచరిక పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైంది. అమరవీరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా లభించిన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.ప్రజల సంక్షేమం, హక్కులు, సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ ప్రజా పాలనను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఇట్టి కార్యక్రమంలో వైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బర్లే రమ్య రామచందర్, మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, కౌన్సిలర్ సభ్యులు బోడ రాధా, సురేష్ బూడిద మధు, కాటబత్తి స్వప్న, బిట్టు సరోజ, కర్రె మాధవి ప్రవీణ్, మెరిమెలి లావణ్య శ్రీధర్, పెరబోయిన సత్యనారాయణ, సాధని ధనలక్ష్మి మధుకర్,ముక్కర్ల మల్లేష్, బబ్బూరు శ్రీధర్, కో ఆప్షన్ సభ్యులు గౌలికర్ అరుణ, రాజేష్,ఎండి రహీమ, సలాం బండి జంగమ్మ, శ్రీశైలం, షేక్ ఉస్మాన్ షరీఫ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు

# విశ్వకర్మల జీవితాల్లో మార్పులు తెస్తాం

**- పుస్తెలు, మెట్టెలు స్వర్ణకారులే తయారు చేసి విక్రయించే ఫైల్‌పైనే తొలి సంతకం: కల్వకుంట్ల కవిత**





**హైదరాబాద్, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**

తెలంగాణ రక్షణ సేనకు ప్రజలు మద్దతు ఇస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వకర్మల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే నిర్ణయాలు చేపడతామని ఆ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. పుస్తెలు, మెట్టెలను స్వర్ణకారులే తయారు చేసి విక్రయించేలా చర్యలు తీసుకునే ఫైల్‌పై తొలి సంతకం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో కవిత పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మల్లోని ఐదు వృత్తి వర్గాలైన మను, మయ, త్వష్ట, విశ్వజ్ఞ, శిల్పిల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా వృత్తుల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వర్ణకారుల వృత్తిలో నెలకొన్న సమస్యలను తాను దగ్గర నుంచి చూశానని, గతంలో చట్టసభల్లోనూ ఈ అంశాలపై మాట్లాడినట్లు కవిత తెలిపారు. వాణిజ్యపరమైన బంగారు దుకాణాల విస్తరణతో సంప్రదాయ స్వర్ణకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్రంగులకు బీమా సదుపాయం కల్పించడంతో పాటు శిల్పులకు దేవాలయాల కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వకర్మల్లోని అనేక కుటుంబాలకు భూములు లేవని, భూమిలేని వర్గాలకు భూమి అందించాలనే ఉద్దేశంతో భూలక్ష్మి పథకాన్ని రూపొందించామని చెప్పారు. భూలక్ష్మి పథకానికి మారోజు వీరన్న, ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంతాచారి స్ఫూర్తిగా నిలిచారని కవిత పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తనకు తండ్రి తర్వాత తండ్రి లాంటి వారని, ఆయన చిత్రపటం లేకుండా తమ పార్టీ కార్యక్రమం ఏదీ నిర్వహించబోమని తెలిపారు. విశ్వకర్మల కష్టాలను తెలుసుకున్న వ్యక్తిగా తనకు వారి ఆశీర్వాదం ఇవ్వాలని కవిత కోరారు. ప్రభుత్వాలు పట్టించుకోకపోయినా నాలుగు దశాబ్దాలుగా విశ్వకర్మ జయంతిని కుల పెద్దలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆమె పేర్కొన్నారు.

# కుక్కలగూడూరులో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**ముువ్వన్నెల జెండా ఆవిష్కరించిన బీజేపీ నాయకులు**



**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్**

పాలకుర్తి మండల పరిధిలోని కుక్కలగూడూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ పాలకుర్తి మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మెరుగు నరేష్ మాట్లాడుతూ... నిజాం విముక్తి కోసం సాగిన తెలంగాణ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. అమరుల త్యాగ నిరతిని స్మరించుకుంటూ, వారి పోరాట స్ఫూర్తితోనే ప్రతీ ఒక్కరూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపు రామన్న, మేడం రాజు, మాజీ ఎంపీటీసీ బొడ్డు రాయమల్లు, జిల్లా కార్మిక సెల్ ప్రధాన కార్యదర్శి సంగెం నగేష్, పాలకుర్తి మండల ప్రధాన కార్యదర్శి తిప్పని రాజకుమార్, నాయకులు కొలిపాక శంకరయ్య, గట్టయ్య, రాజేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టును సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు









**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**

జాతీయ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) సభ్యుడు జాతోతు హుస్సేన్ గురువారం ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) ఉద్యోగులు, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎన్టీపీసీ యాజమాన్యంతో ఆయన విస్తృత సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ పర్యటనలో కమిషన్ డైరెక్టర్ డాక్టర్ పి. కల్యాణ్ రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. కమిషన్ ప్రతినిధి బృందానికి ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ చందన్ కుమార్ సమంతా, సీనియర్ అధికారులు స్వాగతం పలికారు. సమావేశంలో ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ చర్యలు, రిజర్వేషన్ విధానం అమలు, శిక్షణ--నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై ఎన్టీపీసీ యాజమాన్యం సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చింది. అదేవిధంగా గిరిజనులు, పరిసర ప్రాంతాల ప్రజల సామాజిక--ఆర్థిక అభివృద్ధి కోసం ఎన్టీపీసీ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలను కమిషన్‌కు వివరించారు. అనంతరం ఎస్టీ ఉద్యోగులు, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులతో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలు, సమస్యలను తెలుసుకున్నారు. షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు, వారి సాధికారత, అభివృద్ధికి ఉద్దేశించిన సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కమిషన్ ప్రతినిధి బృందం ఎన్టీపీసీ తెలంగాణ పవర్ ప్లాంట్‌ను కూడా సందర్శించింది. ఈ సందర్భంగా ఎస్టీ ఉద్యోగులకు సమాన అవకాశాలు కల్పిస్తూ, సమగ్ర కార్యవాతావరణాన్ని కొనసాగించేందుకు, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వారి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎన్టీపీసీ యాజమాన్యం పునరుద్ఘాటించింది.

# ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం...

**పారదర్శక పాలన, సామాజిక న్యాయం, సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం... మంత్రి వివేక్ వెంకటస్వామి**



**మెదక్, సెప్టెంబర్ 17** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మెదక్ కలెక్టరేట్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కార్మిక, గనుల భూగర్భ శాఖల మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి మంత్రి గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థకు పరివర్తన చెందిన చారిత్రక రోజుగా ప్రజా పాలన దినోత్సవానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రజా పాలనలో పారదర్శకత, అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సందేశం ద్వారా వివరించారు.

కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ ఆఫీసులో "తెలంగాణ ప్రజా పాలన" వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలో చర్య వలన 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనం చేయబడిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజల భాగస్వామ్యం పారదర్శకత జవాబుదారీతనం ఎంతో కీలకమని అన్నారు. ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ ప్రతి పోలీసు అధికారి సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు ప్రజా సంక్షేమం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

**●రూ. 35 లక్షల సీఎస్ఆర్ నిధులతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం**

**●మేయర్ మహంకాళి స్వామి**





**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**

రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఎన్నికైన తర్వాతే ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని నగర మేయర్ మహంకాళి స్వామి పేర్కొన్నారు. గురువారం రామగుండం నగరపాలక సంస్థలోని 33వ డివిజన్ అన్నపూర్ణ కాలనీలో ఎన్టీపీసీ-సీఎస్ఆర్ (జూ=) నిధులు రూ. 35 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ మెరుగు భూలక్ష్మితో కలిసి ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు ప్రభావిత ప్రాంతాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిపోయేవని విమర్శించారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఎన్టీపీసీ ఏర్పాటుతో భూములు కోల్పోయి ప్రభావితమైన ప్రాంతాల అభివృద్ధిపై ప్రస్తుతం ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నిర్దిష్ట ప్రణాళికతో నగర రూపురేఖలు మారుస్తున్నారని, ఆయన మార్గదర్శకత్వంలో పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పుడు నిర్మిస్తున్న సీసీ రోడ్లు కనీసం 30 ఏళ్ల పాటు మన్నికగా ఉండేలా అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వడ్లూరి రవి, గట్ల రమేష్, ముస్తాఫా, మున్సిపల్ ఏఈ మీర్, నాయకులు పెద్దంపేట శంకర్, తిప్పారపు శ్రీనివాస్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**జనగామ జిల్లా :**కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు,

శుక్రవారం,
సెప్టెంబర్ 18, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# అన్నవరం కల్యాణం ఎందుకంత ప్రత్యేకం ఒక్కసారి దర్శిస్తే సకల శుభాలు, ఐశ్వర్యం ప్రాప్తి!





తెలంగాణలోని మరకత శివలింగం- ఒక్కసారి దర్శిస్తే వ్యాధులు మటుమాయం!

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో వైద్యనాథ్ జ్యోతిర్లింగాన్ని దర్శిస్తే వ్యాధులు దూరమవుతాయని పురాణాలు చెబుతున్నాయి. అలాంటి వైద్యనాథ్ జ్యోతిర్లింగాన్ని పోలిన శివలింగం తెలంగాణలోని చందిప్ప గ్రామంలో దర్శనమిస్తుంది. పూర్తిగా మరకతంతో తయారైన ఈ సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు నివృత్తి అవుతాయని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఇంతకూ ఈ పవిత్ర క్షేత్రం ఎక్కడుంది? ఆ విశేషాలేమిటో ఈ కథనంలో చూద్దాం.

మరకత సోమేశ్వర స్వామి ఆలయం ఎక్కడుంది?పరమేశ్వరుడు తన భక్తులను అనుగ్రహించేందుకు ద్వాదశ జ్యోతిర్లింగ రూపాల్లో వెలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే విశ్వాసం ఉంది. పర్లి వైద్యనాథుడిని పోలిన బ్రహ్మసూత్రంతో మెరిసే మరకత శివలింగం తెలంగాణలో చందిప్ప గ్రామంలో దర్శనమిస్తుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ మరకత సోమేశ్వర లింగాన్ని సేవిస్తే వ్యాధులు నివృత్తి అవుతాెలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే యని, సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. మహిమాన్వితమైన ఈ ఆలయం విశిష్టత, స్థల పురాణం గురించి తెలుసుకుందాం.

**చందిప్ప క్షేత్రం చరిత్ర**

సాధారణంగా శివలింగం పార్థివ లింగం, స్ఫటిక లింగం, సైకత లింగం వంటి అనేక రూపాల్లో దర్శనమిస్తుంది. వాటిలో మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో ప్రకాశిస్తూ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. ఇలాంటి అరుదైన మరకత లింగం కొలువై ఉన్న చందిప్ప క్షేత్రానికి దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉంది. ముచుకుంద నది ఒడ్డున ఉన్న ఈ పవిత్ర స్థలంలో క్రీ.శ. 1076--1126 మధ్య పశ్చిమ చాళుక్య రాజు ఆరో విక్రమాదిత్యుడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లుగా తెలుస్తోంది. క్రీ.శ. 1101 కార్తిక శుద్ధ పంచమి గురువారం ఈ క్షేత్రంలో మరకత శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించినట్లు ఆలయంలో లభ్యమైన శాసనాల ద్వారా తెలుస్తోంది.

**ఆలయ జీర్ణోద్ధరణ**

11వ శతాబ్దం నాటి ఈ ప్రాచీన ఆలయం కాలక్రమంలో శిథిలావస్థకు చేరుకుంది. ఆ పరిస్థితుల్లో సుమారు పదిహేను సంవత్సరాల క్రితం కొందరు భక్తులు పూనుకుని మరకత సోమలింగేశ్వర స్వామికి నూతన గర్భగుడిని నిర్మించి ఆలయాన్ని పునరుద్ధరించారు.

**ఆలయ విశేషాలు**

చందిప్ప సోమలింగేశ్వర స్వామి క్షేత్రంలో గర్భాలయంలో శివుని మరకత లింగం ముదురు ఆకుపచ్చ రంగులో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.

ఆరోగ్యాన్ని అందించే మరెలిసినట్లుగా పురాణాలు చెబుతాయి. ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో మహారాష్ట్రలోని పర్లిలో వైద్య నాథేశ్వరుడిగా కొలువుదీరిన శివుడు భక్తులకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తాడనే కత సోమేశ్వరుడు

పర్లి వైద్యనాథ జ్యోతిర్లింగానికి, చందిప్ప మరకత లింగానికి దగ్గర పోలికలు ఉన్నాయని ఆలయ పండితులు చెబుతారు. చందిప్ప శివయ్యను దర్శించి భక్తితో పూజిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

**క్షేత్రపాలకుడిగా కాలభైరవుడు**

చందిప్ప మరకత సోమేశ్వర స్వామి ఆలయానికి కాలభైరవుడు క్షేత్ర పాలకుడిగా వ్యవహరిస్తున్నాడు. సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న కాలభైరవుడు ఆలయాన్ని వెయ్యి కళ్లతో రక్షిస్తాడని నమ్మకం. ఆదివారం కాలభైరవ స్వామిని పూజిస్తే సమస్త గ్రహ దోషాలు తొలగిపోతాయని విశ్వాసం. అలాగే శివుని కుమారుడైన సుబ్రహ్మణ్యస్వామి సర్ప రూపంలో ఆలయ ప్రాంగణంలో సంచరిస్తాడని ప్రతీతి.

**సోమేశ్వర స్వామికి సూర్యాభిషేకం**

2007లో శివరాత్రి సందర్భంగా సోమేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్న సమయంలో తొలిసారిగా శివలింగంపై పడిన సూర్యకిరణాలు పరావర్తనం కావడంతో స్వామి లింగం మరకత లింగమని గుర్తించారు. ఆనాటి నుంచి ఈ ఆలయానికి బహుళ ప్రాచుర్యం లభించింది. అప్పటి నుంచి భక్తుల సహకారంతో ఆలయం దినదినాభివృద్ధి చెందసాగింది.

**పూజోత్సవాలు**

చందిప్ప మరకత సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ త్రికాల పూజలు, అభిషేకాలు, త్రిసంధ్య హారతులు విశేషంగా జరుగుతాయి. ప్రతి సోమవారం విశేష పూజలు జరుగుతాయి. శ్రావణం, కార్తిక మాసాల్లో ప్రత్యేక పూజలు, మహాశివరాత్రి వేడుకలు కూడా ఈ క్షేత్రంలో ఘనంగా నిర్వహిస్తారు.

దర్శన ఫలం

చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రంలో వెలసిన శివయ్యను దర్శిస్తే అనారోగ్య సమస్యలు దూరమవుతాయని సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విశ్వాసం.

**ఎలా చేరుకోవాలి?**

హైదరాబాద్‌కు సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుంది. మనం కూడా చందిప్ప మరకత సోమేశ్వర స్వామి క్షేత్రాన్ని దర్శిద్దాం. ఆయురారోగ్య ఐశ్వర్యాలను పొందుదాం.

**ఓం నమః శివాయ**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# మెటా వన్ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ లాంచ్: ఫీచర్లు, ప్లాన్లు, ధరల వివరాలు ఇవే!



సోషల్ మీడియా దిగ్గజం మెటా సరికొత్త సబ్‌స్క్రిప్షన్ సర్వీస్‌ను ప్రారంభించింది. 'మెటా వన్' పేరుతో ఈ సేవలను తీసుకొచ్చింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్, మెటా ఏఐలలో ఈ సర్వీస్ అందుబాటులో ఉంటుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా యూజర్లు మరింత అధునాతన ఏఐ ఫీచర్లను వినియోగించుకోవచ్చు. ఎక్స్‌ప్రెషన్ సంబంధిత ఫీచర్లలోనూ అదనపు ప్రయోజనాలు లభిస్తాయి. ముఖ్యంగా క్రియేటర్లు, వ్యాపార వినియోగదారుల కోసం ప్రత్యేక ప్రొఫెషనల్ టూల్స్‌ను అందిస్తున్నట్లు మెటా ప్రకటించింది.అయితే మెటా యాప్‌ల ప్రధాన అనుభవం యథావిధిగా ఉచితంగానే కొనసాగుతుందని కంపెనీ స్పష్టం చేసింది. అదనపు ఫీచర్లు కావాలనుకునే వారికి మాత్రమే ఈ సబ్‌స్క్రిప్షన్ ఉపయోగపడుతుంది. ఇప్పటికే 50కి పైగా ప్రీమియం ఫీచర్లను అందుబాటులోకి తెచ్చినట్లు మెటా తెలిపింది. ఇప్పటివరకు 15 మిలియన్లకు పైగా యూజర్లు సబ్‌స్క్రిప్షన్, ట్రయల్స్ తీసుకున్నారని వెల్లడించింది. రానున్న రోజుల్లో మరిన్ని ఫీచర్లను జోడించనున్నట్లు పేర్కొంది. త్వరలో జుఎఙం యాప్, ాౠ× +శ్రీఖుంంవంలలోనూ మెటా వన్ సేవలు విస్తరించనున్నాయి.మెటా వన్ ధరలు, లభ్యత: మెటా వన్ ప్లాన్‌లు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. సింగిల్ యాప్ ప్లాన్‌లు నెలకు 2.99 డాలర్ల నుంచి ప్రారంభం కానున్నాయి. ఏఐ-ఫోకస్డ్ వ్యక్తిగత బండిల్స్ నెలకు 7.99 డాలర్ల నుంచి మొదలవుతాయి. ఇక క్రియేటర్, బిజినెస్ బండిల్స్ 14.99 డాలర్ల నుంచి ప్రారంభమై అత్యంత అధునాతన బిజినెస్ టైర్‌కు 499 డాలర్ల వరకు ఉన్నాయి.వ్యక్తిగత ప్లాన్‌లలో ఇన్‌స్టాగ్రామ్ ప్లస్, ఫేస్‌బుక్ ప్లస్, వాట్సాప్ ప్లస్ ఉంటాయి. అయితే కోర్, ప్రీమియం బండిల్స్ ఈ ఫీచర్లతో పాటు మరింత ఎక్కువ ఏఐ వినియోగాన్ని కలిపి అందిస్తాయి. బిజినెస్ ప్లాన్‌లలో బేసిక్ ప్రెజెన్స్-బిల్డింగ్ టూల్స్‌తో కూడిన ఎసెన్షియల్ నుంచి, పెద్ద టీమ్స్‌కు, ఎక్కువ యూసేజ్ లిమిట్స్ అవసరమయ్యే వారి కోసం ఎక్స్‌పర్ట్, మ్యాక్స్ టైర్ల వరకు ఉన్నాయి.

# కన్య సంక్రమణం వేళ సూర్య భగవానుడిని ఇలా పూజిస్తే- కీర్తి, విజయసిద్ధి ఖాయం!



కన్య సంక్రమణం వేళ సూర్య భగవానుడిని ఇలా పూజిస్తే- కీర్తి, విజయసిద్ధి ఖాయం!

సూర్యుని రాశి మార్పుతో ఏర్పడే సంక్రమణం. సింహ రాశి నుంచి కన్య రాశిలోకి ప్రవేశించనున్న సూర్యభగవానుడు. పితృ దేవతలకు ప్రీతికరం సంక్రమణం. కన్య సంక్రమణం రోజు చేసే సూర్య ఆరాధనతో విజయ సిద్ధి.

సంక్రమణం అంటే?

సంక్రమణం లేదా సంక్రాంతి అంటే సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి ప్రవేశించడం లేదా మారడం అని అర్థం. ఒక సంవత్సర కాలంలో సూర్యుడు ద్వాదశ రాశులలో సంచరిస్తాడు. సూర్యుడు ఒక రాశి నుంచి మరో రాశిలోకి మారుతున్న ఆ సమయాన్నే సంక్రమణం అంటారు.

ఏడాదిలో 12 సంక్రాంతులు

సూర్యుడు ప్రతి నెలా ఒక రాశిలోకి మారుతాడు కాబట్టి, సంవత్సరానికి 12 సంక్రాంతులు వస్తాయి. సూర్యుడు ఏ రాశిలోకి ప్రవేశిస్తే ఆ రాశి పేరుతో సంక్రాంతి ఏర్పడుతుంది.కన్య సంక్రమణం విశిష్టత సూర్యుడు సింహ రాశి నుంచి కన్య రాశిలోకి ప్రవేశించే శుభ సమయాన్ని కన్యా సంక్రమణం లేదా కన్యా సంక్రాంతి అంటారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17, గురువారం ఉదయం 07:58 గంటలకు నిమిషాలకు సూర్యుడు కన్యారాశిలోకి ప్రవేశిస్తాడు.

మహా పుణ్యకాల ముహూర్తం:

కన్య సంక్రమణం మహా పుణ్యకాలం ఈ రోజు ఉదయం 07:58 నిమిషాల నుంచి ఉదయం 8:13 నిమిషాల వరకు వ్యాపించి ఉంటుంది. ఈ సమయంలో చేసే నదీ స్నానం, సూర్య ఆరాధన, దానధర్మాలు, పితృదేవతల ఆరాధన సాధారణం కంటే కోటిరెట్ల అధికఫలాన్ని ఇస్తాయని విశ్వాసం.కన్య సంక్రమణం ఎలా జరుపుకోవాలి?కన్య సంక్రమణం పవిత్రమైన రోజున భక్తులు నదీస్నానాలు లేదా పుణ్య జలాల్లో స్నానం చేయడం ఆచారంగా వస్తోంది. దీనివల్ల శరీర, మనః శుద్ధితో పాటు జన్మాంతర పాపాలు తొలగిపోతాయని నమ్ముతారు.సూర్య ఆరాధన:

కన్య సంక్రమణం సూర్యుడిని భక్తిశ్రద్ధలతో పూజించడం సంప్రదాయం. పరమ పవిత్రమైన ఈ రోజు సూర్యోదయం తోనే నిద్ర లేచి నదీస్నానం చేయాలి. అనంతరం ఒక రాగి పాత్రలో నీటిని తీసుకుని అందులో అక్షింతలు, ఎర్రని పూలు వేసి సూర్యునికి అర్ఘ్యం సమర్పించాలి. అనంతరం సూర్యునికి అభిముఖంగా నిలబడి ఆదిత్య హృదయం పారాయణ చేయారాగి పాత్రలో నీటిని తీసుకుని అందులో జస్సు లభిస్తుందని శాస్త్ర వచనం.జరాగి పాత్రలో నీటిని తీసుకుని అంద పితృ దేవతల ఆరాధనరాగి పాత్రలో నీటిని తీసుకుని అందులో

పవిత్రమైన కన్య సంక్రమణం రోజు నదీతీరంలో గతించిన పితృ దేవతలకు పిండ ప్రదానాలు, జల, తిల తర్పణాలు విడిచి పెట్టడం వలన వారికి సద్గతులు లభిస్తాయని విశ్వాసం. అంతేకాదు ఈ రోజు బ్రాహ్మణులకు పితృ దేవతల పేరిట దానధర్మాలు చేయడం వలన వంశాభివృద్ధి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పితృపక్షాలు గా పిలవబడే మహాలయ పక్షాలలో వచ్చే ఈ కన్యా సంక్రమణం సందర్భంగా చేసే పిండ ప్రదానాలు, దానాలతో పితృ దేవతలు ప్రీతి చెందుతారని శాస్త్రం చెబుతోంది.

జాతకంలో బలపడే సూర్య స్థానం

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక వ్యక్తి జీవితంలో సూర్యుడు బలహీనంగా ఉంటే వృత్తి పరంగా అనేక సమస్యలు, ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కన్యా సంక్రమణం రోజు చేసే స్నాన, దాన, జపాల వలన జాతకంలో సూర్యుని స్థానం బలపడుతుంది. ఆర్థిక పరమైన, ఆరోగ్య పరమైన సమస్యలు తగ్గుముఖం పడతాయి. మరో ముఖ్య విశేషం ఏమిటంటే జాతకంలో సూర్య స్థానం బలంగా ఉంటే కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. అందుకే ఈ కన్య సంక్రమణం రోజున చేసే సూర్య ఆరాధన వలన కీర్తి ప్రతిష్టలు కూడా వృద్ధి చెందుతాయి. రానున్న కన్య సంక్రమణం రోజు మనం కూడా సూర్య భగవానుని ఆరాధించి, పితృదేవతలకు తర్పణాలు విడిచి పెడదాం! ఆయురారోగ్య ఐశ్వర్యాలను, వంశాభివృద్ధిని పొందుదాం. ఓం శ్రీ ఆదిత్యాయ నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంత వరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.తీసుకుని అందులో

పవిత్రమైన కన్య సంక్రమణం రోజు నదీతీరంలో గతించిన పితృ దేవతలకు పిండ ప్రదానాలు, జల, తిల తర్పణాలు విడిచి పెట్టడం వలన వారికి సద్గతులు లభిస్తాయని విశ్వాసం. అంతేకాదు ఈ రోజు బ్రాహ్మణులకు పితృ దేవతల పేరిట దానధర్మాలు చేయడం వలన వంశాభివృద్ధి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పితృపక్షాలు గా పిలవబడే మహాలయ పక్షాలలో వచ్చే ఈ కన్యా సంక్రమణం సందర్భంగా చేసే పిండ ప్రదానాలు, దానాలతో పితృ దేవతలు ప్రీతి చెందుతారని శాస్త్రం చెబుతోంది.

జాతకంలో బలపడే సూర్య స్థానం

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక వ్యక్తి జీవితంలో సూర్యుడు బలహీనంగా ఉంటే వృత్తి పరంగా అనేక సమస్యలు, ఆర్థిక సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కన్యా సంక్రమణం రోజు చేసే స్నాన, దాన, జపాల వలన జాతకంలో సూర్యుని స్థానం బలపడుతుంది. ఆర్థిక పరమైన, ఆరోగ్య పరమైన సమస్యలు తగ్గుముఖం పడతాయి. మరో ముఖ్య విశేషం ఏమిటంటే జాతకంలో సూర్య స్థానం బలంగా ఉంటే కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. అందుకే ఈ కన్య సంక్రమణం రోజున చేసే సూర్య ఆరాధన వలన కీర్తి ప్రతిష్టలు కూడా వృద్ధి చెందుతాయి. రానున్న కన్య సంక్రమణం రోజు మనం కూడా సూర్య భగవానుని ఆరాధించి,

# మీరు భోజనానికి ఏ 'పాత్రలు' వాడుతున్నారు? - వీటిల్లో తినడం మంచిదికాదట!



ఆధునిక జీవితంలో ప్లాస్టిక్, ఫైబర్, సిరామిక్ ప్లేట్లలో భోజనం చేయడం అలవాటుగా మారిపోయింది. వంటకాలు రుచిగా ఉన్నాయా? ఆరోగ్యకరమైనవి తింటున్నామా? అనే దానిపై పెట్టే శ్రద్ధ, ఏ పాత్రలో తింటున్నాం అనే దానిపై పెట్టడం లేదు. కానీ, పూర్వీకులు వండిన ఆహారానికే కాదు, వడ్డించే పాత్రలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు. ఒక్కో లోహానికి ఒక్కో ప్రత్యేక గుణం ఉంటుందని, ఆయా పాత్రల్లో భోజనం చేస్తే శరీరంలోని ముఖ్య దేహ గుణాలు సమతుల్యమవుతాయని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది. ఇత్తడి, కంచు నుంచి మొదలుకొని పచ్చని విస్తరాకుల వరకు, ఏ పాత్రలో భోజనం చేస్తే ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి ఇలా వివరిస్తున్నారు.బంగారు పాత్రలు : బంగారు పాత్రల్లో ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలోని ముఖ్య దేహ గుణాలు (వాత, పిత్త, కఫ) అదుపులో ఉంటాయి. మెదడుకు సంబ ధించిన సమస్యలకు ఇది చెక్ పెడుతుంది. సంపూర్ణ ఆరోగ్యాన్ని, స్థిరత్వాన్ని ఇస్తుందని చెబుతున్నారు.వెండి పాత్రలు : వెండి కంచంలో తినడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. శరీరంలోని అధిక వేడిని ఇది లాగేసుకుంటు ంది. కఫ, వాత గుణాలను సమతుల్యంగా ఉంచుతుంది.కంచు పాత్రలు : కంచు పాత్రల్లో భోజనం చేయడం జ్ఞాపకశక్తికి ఎంతో మంచిది. ఇది ఆహారానికి రుచిని అద్దడంతో పాటు శరీరంలో రక్త ప్రసరణను, ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది.ఇత్తడి పాత్రలు : ఈ పాత్రల్లో భోజనం చేయడం వల్ల వాత గుణం, శరీరంలో వేడి కాస్త పెరుగుతాయి. ఇది ఉదరంలోని క్రిములను, కఫాన్ని నాశనం చేయడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

ఇనుము, ఉక్కు పాత్రలు : వీటిలో ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుంది. శరీరంలో వాపులు, తెల్ల మచ్చలు, కామెర్లు వంటి వ్యాధుల నివారణకు దోహదపడుతుంది. ఆకులు/విస్తరాకులు : అరటి లేదా ఇతర విస్తరాకుల్లో భోజనం చేయడం అత్యుత్తమ సహజ పద్ధతి. ఇది ఆహారానికి రుచిని, తినాలనే కోరికను పెంచుతుంది. అన్నిటి కంటే ముఖ్యంగా ఆహారంలోని విషతుల్యాలను, మలినాలను లాగేసుకుంటుందని చెబుతున్నారు ఆయుర్వేద నిపుణులు.రొమ్ము క్యాన్సర్ ముప్పు ను తగ్గించే సూపర్ ఫుడ్స్ - ఆహారంలో వీటిని చేర్చుకుంటే మేలంటున్న నిపుణులు!ఈ పాత్రలు వద్దట! :రాతి, మట్టి పాత్రలు : భోజనం చేయడానికి రాతి, మట్టి పాత్రలు వాడటం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని ఆయుర్వేదం సూచిస్తోంది.చెక్క పాత్రలు : ఈ పాత్రల్లో తింటే ఆహారం రుచిగా అనిపించినప్పటికీ, శరీరంలో కఫాన్ని వృద్ధి చేస్తాయి.దేహ తత్వాలు! :వాతం : రక్త ప్రసరణ, శ్వాసక్రియ, నరాల ప్రసారాలు, నాడీ వ్యవస్థ కదలికలను నియంత్రిస్తుంది.పిత్తం : జీర్ణక్రియ, ఆహారాన్ని శక్తిగా మార్చడం (మెటబాలిజం), శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీక రించడం దీని బాధ్యత.కఫం : శరీరానికి బలాన్ని, స్థిరత్వాన్ని ఇవ్వడం, కీళ్లకు తేమను అందించడం రోగనిరోధక శక్తిని పెంచడం. తాగునీటికి ఏది మేలు? : నీరు తాగడానికి పైన పేర్కొన్న లోహ పాత్రలన్నీ మంచివే. అవి అందుబాటులో లేనప్పుడు మట్టి కుండలు అత్యుత్తమం. ఇక స్ఫటికం, గాజు, వైఢూర్యం లాంటి వాటితో చేసిన పాత్రలు చలవ చేసే గుణాన్ని కలిగి ఉంటాయి. : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఎస్పీ ఆఫీసులో "తెలంగాణ ప్రజా పాలన" వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలో చర్య వలన 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో విలీనం చేయబడిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజల భాగస్వామ్యం పారదర్శకత జవాబుదారీతనం ఎంతో కీలకమని అన్నారు. ప్రజల భద్రత శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ ప్రతి పోలీసు అధికారి సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు ప్రజా సంక్షేమం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**జనగామ జిల్లా :**కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు, అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన ఆయన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కళాకారులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు, పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ప్రజల అవసరాలు తెలుసుకుని పరిష్కారం చూపే విధంగా ప్రజా పాలన కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణను ప్రజల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కొండపైన తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని పతాకావిష్కరణ.

● రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించిన ఈఓ భవాని శంకర్.





**యాదగిరిగుట్ట,**

తెలంగాణ విమోచన దినోత్సవం ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యాలయ ప్రాంగణంలో గురువారం పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఆలయ ఈవో ఈవో భవాని శంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం శాంతి, సౌభ్రాతృత్వం, అభివృద్ధి, సుభిక్షతతో మరింతగా వర్ధిల్లాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు బోర్డు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన, క్షేత్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి యాదాద్రి క్షేత్ర విశిష్టతను జాతీయ స్థాయిలో మరింత ఇనుమడింపజేసే దిశగా కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు స్థానాచార్యులు కాండూరి వెంకటాచార్యులు సురేంద్రాచార్యులు, పురోహితులు నాగరాజ్ శర్మ డిఇఓ భాస్కర్ శర్మ ఏ ఈ ఓ లు గజవెల్లి రఘు శ్రవణ్ కుమార్ అశోక్ జూ శెట్టి కృష్ణ, సూపరింటెంట్లు విజయ్ కుమార్ శ్రీకాంత్ రాజన్ బాబు సిబ్బంది అశ్విని హరిత మల్లేష్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో కనులపండువగా 'కాశీ గంగా హారతి'

● గణపతి నవరాత్రి ఉత్సవాల్లో విశేష ఆకర్షణగా నిలిచిన కార్యక్రమం

● హాజరైన పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు













**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**

గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గోదావరిఖని జీఎం కాలనీలో 'టీమ్ 505209' యువత ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన 'కాశీ గంగా హారతి' కార్యక్రమం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య సాగింది.

ప్రపంచ ప్రసిద్ధ కాశీ క్షేత్రంలో గంగా నదికి నిర్వహించే హారతి తరహాలోనే, గోదావరిఖనిలోని వినాయకుడి సన్నిధిలో ప్రత్యేకంగా ఈ హారతిని నిర్వహించడం కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హారతి సమయంలో భక్తులంతా పూర్తిగా ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు.

**ముఖ్య అతిథుల రాక**

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి అర్చన -- సంతోష్ రావు అంబటి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు వాహిని షాపింగ్ మాల్ వెంకన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, కార్పొరేటర్ నెలకంటి రాము తదితరులు ఈ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యువతను అభినందించిన అతిథులు**

ఈ సందర్భంగా సంతోష్ రావు అంబటి మాట్లాడుతూ.. టీమ్ 505209 యువతను ప్రత్యేకంగా అభినందించారు. కాశీలో నిర్వహించే గంగా హారతిని రామగుండం ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించడం ద్వారా యువత గొప్ప ఆధ్యాత్మిక శోభను ఆవిష్కరించారని కొనియాడారు. యువత కేవలం వినోదానికే పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు, సృజనాత్మకత, టీమ్ స్పిరిట్‌తో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించగలరని ఆయన పేర్కొన్నారు. టీమ్ 505209 సభ్యులు చూపిస్తున్న ఐక్యత, ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమ నిర్వహణఈ వేడుకను విజయవంతం చేయడంలో నిర్వాహకులు అభి ప్రభ, వైభవ్, బబ్లూ పటేల్, శశి, నీలపు పండు, పవన్, సాయి చిన్ని, ఈశ్వర్, శశాంక్ తదితరులు ప్రత్యేక చొరవ తీసుకుని సమన్వయంతో వ్యవహరించారు. ఉత్సవాల్లో భాగంగా ఇటువంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న యువతను పలువురు ప్రముఖులు అభినందించారు.

# విశ్వకర్మ భగవానుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

-- చెరబండ రాజునగర్‌లో ఘనంగా శ్రీ విశ్వకర్మ యజ్ఞం --

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



**బాలానగర్ సెప్టెంబర్ 18 ( పీపుల్స్ న్యూస్)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజునగర్‌లో శ్రీ హనుమాన్ దేవాలయం వద్ద శ్రీ విశ్వకర్మ యజ్ఞంను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ విశ్వకర్మ భగవానునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ విశ్వకర్మ భగవానుని దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. విశ్వకర్మ యజ్ఞం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, వివిధ వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సామాజిక ఐక్యతను చాటుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి, సేవాభావంతో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, యజ్ఞంలో పాల్గొన్న భక్తులతో ఆవుల రవీందర్ రెడ్డి ముచ్చటించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగగా, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ విశ్వకర్మ భగవానుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో జయరాములు చారి, బాలకృష్ణ చారి, మొనప్ప చారి, కృష్ణ చారి, ప్రభాకర్ చారి, బ్రహ్మయ్య చారి, దత్తాత్రి చారి, అనిల్ చారితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుజాత గౌడ్, రంగంపేట్ శ్రీనివాస్, ప్రేమ్ కుమార్ తదితరులు, స్థానికులు మరియు భక్తులు పాల్గొన్నారు

# త్యాగాల పోరాట ఫలితమే తెలంగాణ హైదరాబాద్ విలీనం

-- సాయుధ రైతాంగ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారు: సీపీఐ నేత జి. కృష్ణ




**బాలానగర్ సెప్టెంబర్ 18 ( పీపుల్స్ న్యూస్)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో తెలంగాణ విలీనం దినోత్సవాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీనగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ శ్రీనగర్ శాఖ కార్యదర్శి కె. మనోచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను స్మరించుకుంటూ అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రజల హక్కులు, భూమి, స్వేచ్ఛ కోసం సాగిన చారిత్రాత్మక పోరాటమని పేర్కొన్నారు. అప్పటి దోపిడీ వ్యవస్థకు, జమీందారులు, జాగీర్దారులు, పెత్తందారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రైతులు, పేదలు, కూలీలు ఐక్యంగా ఉద్యమించారని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సుమారు ఐదు వేల మంది అమరుల త్యాగాలు ఉన్నాయని, వారి ప్రాణత్యాగాల స్ఫూర్తితోనే ఉద్యమం ముందుకు సాగిందని జి. కృష్ణ అన్నారు. ఈ పోరాటం ద్వారా పేదలు, భూమిలేని నిరుపేద కుటుంబాలకు పెద్దఎత్తున భూములు పంచిన చారిత్రక పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు. దోపిడీ, వెట్టిచాకిరీ, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు ఎన్నో కష్టాలు, హింసలు ఎదుర్కొంటూ పోరాటాన్ని కొనసాగించారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా సాగిన ప్రజా ఉద్యమాలు, రైతాంగ పోరాటాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక ఘట్టం చోటుచేసుకుందని ఆయన వివరించారు. తెలంగాణ విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని జి. కృష్ణ అన్నారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ పోరాటానికి ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్న ఆయన, ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, దోపిడీ నిర్మూలన కోసం కమ్యూనిస్టు ఉద్యమం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దావీద్, గంగన్న, రాములు, పెంటయ్య, ఉమాదేవి, బాలయ్య తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ మేరకు కార్యక్రమం సందర్భంగా జాతీయ జెండాకు వందనం చేసి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరుల త్యాగాలను స్మరించుకున్నారు

# బాలానగర్‌లో వేడుకగా 'ప్రజాపాలన దినోత్సవం': లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**-- కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్ చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్**





**బాలానగర్ సెప్టెంబర్ 18 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బాలానగర్ డివిజన్‌లో ఉత్సాహంగా సాగింది. సెప్టెంబర్ 17 'ప్రజాపాలన దినోత్సవం' పురస్కరించుకుని బాలానగర్ ప్రధాన రహదారిపై కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్ చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వినాయకనగర్ రేషన్ షాప్ వద్ద ఏఎస్ఓ కళ్యాణ్ తో కలిసి అర్హులైన లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... నిత్యావసర సరుకులు, సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి సులభంగా, వేగంగా అందాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచేందుకు, అక్రమాలకు తావులేకుండా సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. ఈ కార్డులు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

**-- రాష్ట్రంలో 1.05 కోట్లకు చేరిన రేషన్ కార్డులు: ఏఎస్ఓ కళ్యాణ్ ....**

ఏఎస్ఓ కళ్యాణ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దీనిద్వారా అదనంగా 61.09 లక్షల మందికి ఆహార భద్రత లభించిందన్నారు. కొత్త కార్డుల మంజూరుతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.05 కోట్లకు చేరుకుందని, తద్వారా మొత్తం 3.42 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధి చేకూరనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఏ-బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పుష్పారెడ్డి, బాలానగర్ డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి శ్రీకాంత్ పటేల్, అధికార ప్రతినిధి మధుమోహన్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు,గోపగోని శ్రీనివాస్ గౌడ్, ఎరుపుల మహేందర్, సదా గౌడ్, జల్లా శివ, బి.ఎస్.ఎస్. కుమార్, రేణుక, పద్మావతి, శ్వేత, ఊర్మిళ, సాయి భారతి, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఆత్మ గౌరవంతో జీవించాలి

**--మెదక్ ఎంపీ రఘునందన్ రావు**



**మెదక్ సెప్టెంబర్ 17**
దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించారు. గురువారం కలెక్టర్లోని సమావేశ మందిరంలో దివ్యాంగుల సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. గౌరవ దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా వికలాంగుల కు ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. మోదీ గారు గత 25 సంవత్సరాల పేద ప్రజలకు ప్రజా సేవ చేస్తున్నారని గుర్తు చేశారు. 6 నెలలుగా 461 మంది దివ్యాంగులను గుర్తించి 850 దివ్యంగా సహాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. దివ్యాంగులు మొన్న జరిగిన గ్లాస్ కో క్రీడల్లో ప్రపంచంలో 4 వ స్థానం సాధించి 39 పథకాలు ఇండియాకు తీసుకొచ్చారని , ఇన్ని పథకాలు ఏ క్రీడలకు కూడా ఇండియాకు రాలేదని, దివ్యాంగులు ఎవరికి తక్కువకాని , ఆత్మవిశ్వాసంతో జీవించాలని అన్నారు. దివ్యాంగులు సమాజంలో గౌరవప్రదంగా, స్వయం ఆధారితంగా జీవించేందుకు అవసరమైన సహాయాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా అడ్డంకులు లేని, సమగ్ర, సౌకర్యవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..**
సహాయ పరికరాల పంపిణీ ద్వారా దివ్యాంగుల చలనశీలత, వినికిడి సామర్థ్యం, దైనందిన కార్యకలాపాల్లో స్వయం ఆధారితత మెరుగుపడటంతో పాటు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రుల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**-- ఫతేనగర్‌లోని పలు వినాయక మండపాలను సందర్శించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**



**బాలానగర్ సెప్టెంబర్ 18 ( పీపుల్స్ న్యూస్)**
వినాయక నవరాత్రి ఉత్సవాలు ఫతేనగర్ డివిజన్ పరిధిలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడికి భక్తిపూర్వకంగా పూజలు నిర్వహించి, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. వినాయక మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు సతీష్ గౌడ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల నిర్వహణ తీరును పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తి, ఐక్యత, సోదరభావాన్ని చాటేలా వినాయక నవరాత్రివేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు.

**-- భక్తులకు అన్నదానం**
ప్రత్యేక పూజల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని పండాల సతీష్ గౌడ్ ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నవరాత్రులు ప్రజలను భక్తి మార్గంలో నడిపించడంతో పాటు, సమాజంలో ఐక్యత, సేవాభావం, పరస్పర సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంత ులతో, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ ఉత్సవ నిర్వాహకులకు, భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్ర మంలో వినాయక మండపాల నిర్వాహకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జన్నారంలో విశ్వకర్మ జయంతి వేడుకలు

**- జెండా ఆవిష్కరించిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు**



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సెప్టెంబర్ 17**
విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని జన్నారం మండలంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. విశ్వకర్మ మహనీయుని సేవలను స్మరించుకుంటూ, సమాజ ఐక్యత, సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. సంప్రదాయ వృత్తుల పరిరక్షణతో పాటు యువతకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కదర్ల నరసయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ ఓజి శ్రీనివాస్, కోశాధికారి కొత్త శ్రీనివాస్, సంఘ ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వాలి

**- జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ డిమాండ్**




**హైదరాబాద్: సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన శాంతియుత ధర్నాకు ప్రభుత్వం, పోలీసులు అనుమతి ఇవ్వాలని జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్, కన్వీనర్ జనార్ధన్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ హైధర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ధర్నాకు అనుమతి కోరుతూ సెప్టెంబర్ 12న అంబర్‌పేట్ డీసీపీకి వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటివరకు అనుమతి ఇస్తారో లేదో స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. రెండు రోజులుగా దోమలగూడ పోలీస్ స్టేషన్, డీసీపీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ విజ్ఞప్తిపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు మాత్రమే అనుమతి కోరుతున్నామని తెలిపారు. ప్రభుత్వంపై తమకు నిరసన ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలు జరిగిన అన్ని రోజుల్లో అసెంబ్లీ ముట్టడి చేసే అవకాశం ఉన్నా అలా చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు ప్రస్తుతం పోలీసు క్యాంపులుగా మారిన పరిస్థితి ఉందని వారు ఆరోపించారు. కళాశాలల వద్ద మోహరించిన పోలీసులను వెంటనే వెనక్కి పిలవాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. ఇంజనీర్స్ డే సందర్భంగా తమ ఉపాధ్యాయులను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేన చర్చలకు పిలిచి అవమానించడం సరికాదని, దీనిపై ఆమె వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ ఇప్పటివరకు విద్యార్థులను కలవలేదని, కమిటీ అపాయింట్‌మెంట్ కోరినా స్పందించడం లేదని జేఏసీ నాయకులు తెలిపారు. అసెంబ్లీలో జీవో 97పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సవరణలు చేస్తామని చెప్పారని, అయితే తాము సవరణలను కోరడం లేదని, జీవో 97ను పూర్తిగ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. నెల రోజులుగా విద్యార్థులు, ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ తమ సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా జీవో 97ను వెంటనే రద్దు చేయాలని కోరారు. సెప్టెంబర్ 18 నుంచి జరగనున్న మిడ్ ఎగ్జామ్స్‌ను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ధీరజ్, మనిదర్, శివ, గోవింద్, సుధాకర్ రెడ్డి, దుర్గ ప్రసాద్, జస్విన్, రన్ విజయ్, సైమాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

**- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**








**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 17 :** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ, శాసనసభ వ్యవహారాల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అమరవీరుల స్తూపం వద్ద, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి తదితర అంశాలను వివరించారు.

తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శేఖర్ రెడ్డి, సిరిపురం యాదగిరి, కాకి కుమార్, దినేష్ చంద్ర అమరవీరుల కుటుంబ సభ్యులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి,శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్,జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి,కిరణ్మయి, జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్,శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్,జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి,కలెక్టరేట్ ఏ.ఓ. సునీల్‌తో పాటు ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలతో ప్రజలకు మరింత చేరువగా పోలీసు వ్యవస్థ

**గత ఎనిమిదేళ్లుగా గణేష్ మండపాలను సందర్శిస్తున్న సీపీ సుమతి**





**మల్కాజిగిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 17 (పీపుల్స్ న్యూస్)**
గణేష్ ఉత్సవాలు ప్రజలను, పోలీసులను మరింత దగ్గర చేసే గొప్ప అవకాశమని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పేర్కొన్నారు. డీసీపీ నార్త్‌గా పనిచేసిన రోజుల నుంచి గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాలను సందర్శించడం కొనసాగిస్తున్నానని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా గణేష్ మండపాలను తప్పకుండా సందర్శిస్తూ నిర్వాహకులు, భక్తులతో మమేకమవుతున్నట్లు సీపీ సుమతి తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా వివిధ వర్గాల ప్రజలను కలుసుకోవడం, వారి సమస్యలను తెలుసుకోవడం, భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేయడం ద్వారా పోలీసులకు, ప్రజలకు మధ్య సాన్నిహిత్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు ఒక మంచి ప్రయోజనం కోసం సమాజంలోని వివిధ వర్గాలను మరింత దగ్గర చేసే వేదికగా నిలుస్తాయని అన్నారు. శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని సీపీ సుమతి సందర్శించారు. నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సహకారంతో గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు.

## ఏషియన్ గేమ్స్ నుంచి తెలుగోడు.. వన్డే టీం నుంచి పంత్, పాండ్యా ఔట్..



వెస్టిండీస్ క్రికెట్ జట్టు తో సెప్టెంబర్ 27 ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత క్రికెట్ జట్టు ఎంపిక పూర్తయింది. ప్రధాన ఆటగాళ్లు కొందరు ఆసియా క్రీడలు ఆడేందుకు జపాన్ వెళ్లనున్న నేపథ్యంలో యువ సారథి శుభ్‌మన్ గిల్ ) నేతృత్వంలో సరికొత్త కూర్పుతో కూడిన బృందాన్ని ప్రకటించారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆలోచనలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవడం విశేషం. ఇంగ్లండ్ గడ్డపై ప్రసిద్ధ లార్డ్స్ మైదానంలో అద్భుతమైన శతకం బాదిన రోహిత్ ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటూ మేనేజ్‌మెంట్ ఆయనను కొనసాగించింది. ఇక ఎంపిక ప్రక్రియలో ప్రధానంగా కనిపించిన ఐదు కీలక పరిణామాలు విశ్లేషకులను ఆకర్షిస్తున్నాయి. మొదటిది రోహిత్ ఎంపిక కాగా, రెండో అంశం స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వికెట్ కీపర్ రిషబ్ పంత్ లకు చోటు దక్కకపోవడం. పాండ్యా ఇంకా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో పక్కన పెట్టారు. పంత్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ధ్రువ్ జురెకు వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించారు.
ఇక ఎంపిక ప్రక్రియలో ప్రధానంగా కనిపించిన ఐదు కీలక పరిణామాలు విశ్లేషకులను ఆకర్షిస్తున్నాయి. మొదటిది రోహిత్ ఎంపిక కాగా, రెండో అంశం స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, వికెట్ కీపర్ రిషబ్ పంత్ లకు చోటు దక్కకపోవడం. పాండ్యా ఇంకా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో పక్కన పెట్టారు. పంత్‌ను పరిగణనలోకి తీసుకోకుండా ధ్రువ్ జురెల్కు వికెట్ కీపింగ్ బాధ్యతలు అప్పగించారు.

మూడో అంశం ఏమిటంటే, దేశవాళీ పోటీలలో అదరగొట్టిన ఇద్దరు కొత్త ముఖాలకు భారత జట్టు తలుపులు తెరుచుకున్నాయి. షేర్-ఎ-పంజాబ్ టీ20 లీగ్ లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన పంజాబ్ ఆల్‌రౌండర్ నమన్ ధీర్ తొలిసారి వన్డే జట్టు పిలుపును అందుకున్నారు. రెడ్ బాల్ క్రికెట్ వేదికలపై నిలకడగా రాణిస్తున్న జమ్మూ కశ్మీర్ ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీ ) సైతం తొలిసారి భారత వన్డే జట్టులోకి ఎంపికయ్యారు. మూడో అంశం ఏమిటంటే, దేశవాళీ పోటీలలో అదరగొట్టిన ఇద్దరు కొత్త ముఖాలకు భారత జట్టు తలుపులు తెరుచుకున్నాయి. షేర్-ఎ-పంజాబ్ టీ20 లీగ్ × లో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన పంజాబ్ ఆల్‌రౌండర్ నమన్ ధీర్ తొలిసారి

## హెచ్‌సీఏ మహిళల అండర్-19 టీ20 టోర్నీకి రంగం సిద్ధం



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్మహిళల అండర్- విభాగంలో నిర్వహించనున్న టీ20 సూపర్ లీగ్టోర్నీకి సంబంధించి మొత్తం ఎనిమిది జట్లను మంగళవారం అధికారికంగా వెల్లడించింది. క్రికెట్‌లో అత్యంత పొట్టి ఫార్మాట్‌లో వర్ధమాన మహిళా క్రికెటర్ల సత్తా చాటేందుకు ఈ లీగ్ వేదిక కానుంది. యువ క్రీడాకారిణులకు నాణ్యమైన మ్యాచ్ అనుభవం కల్పించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించే లక్ష్యంతో ఈ జట్లను ఎంపిక చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన అమ్మాయిలకు ఈ జట్లలో చోటు దక్కింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు భవిష్యత్తులో ఉన్నత స్థాయి అవకాశాలు దక్కే వీలుంది. జట్ల వివరాల్లోకి వెళితే, టీమ్ ఏం జట్టుకు కమ్మిలి నిధి) కెప్టెన్, వికెట్ కీపర్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో సి.దీక్షిత, జాస్మిన్ గిల్, బి.కీర్తన, అక్షర గుండు, కె.అర్పిత, ధృవిజ్ఞ, అల్లం సృష్టి, సిమ్రాన్ యాదవ్, శ్రీజ, మిద్దెల లికిల (నల్గొండ), ముదావత్ సింధుజ ఎంపికయ్యారు. టీమ్ బిం బృందానికి జి.కావ్య శ్రీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టగా, నందిగామ అక్షయ, ఆదిమూలం హాసిని, బి.గీతిక ప్రియదర్శిని, వేముల జెనిక్ష, ఆయిషా షేక్, తూము అనన్య, రుక్సార్, ప్రవళిక, తలారి సంసిత, పన్యాల సహస్ర, ప్రణవి సభ్యులుగా ఉన్నారు. టీమ్ సిం జట్టుకు కట్టా తేజస్విని సారథ్యం వహిస్తుండగా, ప్రతీక కంచర్ల, ఎడ్ల దర్శిని, లింగంపల్లి లక్ష్మి సహస్ర, జి.హేష్మిత శ్రీ, సుప్రీత, బుక్య శారద, నక్కా నిధి కృష్ణ, మేఘన గౌడ్, పట్టిక షాన్వి, సామల చిద్విలాసిని, అంకెనగారి సుచరిత స్థానం సంపాదించారు. టీమ్ డిం జట్టుకు ఎం.శ్రీ గ్రంథ నాయకత్వం వహిస్తున్నారు. ఇందులో ఆర్.లలిత, సజ్జా నాగ శ్రీ చరిత, ఎన్.నీతా శాశ్వత, ప్రతీక, టి.జాహ్నవి, పి.తనుషిక, కె.సహస్ర, ఝాన్సీ, లకవత్ చైతన్య, కన్నం శ్రేయ, సోనాలి ఆడనున్నారు. టీమ్ ఈం జట్టు పగ్గాలను ఎం.చార్వి లక్ష్మి శ్రీ అందుకోగా, వై.ఈశ్వరి, ఎం.అక్షిత గౌడ్, సాయి తనుశ్రీ, స్వాగతిక పాండ, సి.నాగ రూపిణి, పోలమ శ్రీవాస్తవ, పెవల్ తనీష, ముత్యాల అనిక, వానరాసి ప్రసన్న, సి.జయ కాత్యాయని, బుచ్చి హాసిని ఉన్నారు. మిగిలిన జట్లలో టీమ్ ఎఫ్‌ం జట్టుకు ఎన్.బబిత ఫ్లైన్‌గా ఉండనున్నారు. సి.నాగసాయి అక్షిత, బొక్క దీప్షిక, డి.అనన్య, టి.హర్షిణి, పూర్క రిషిమ, డి.నిష్ట, ధరావత్ రిషిక, ఇ.గౌతమి, పూర్వ లాహోటి, నవురు సంజన, ఎ.జుచితా రెడ్డి జట్టులో చోటు దక్కించుకున్నారు. టీమ్ జిం బృందాన్ని ప్రతీక్ష వెంకటేషనడిపించనుండగా, శరగూడం మిత్ర, పి.బంధన, హీరల్ జోషి, ధరావత్ శ్రావణి, యమున, అక్కి ఆశ్రిత, ఆస్థా శర్మ, సముద్రాల ఇనాయ, శ్రీ సహస్ర రాజ్, డి.ప్రణవి, ఉదయ చంద్రిక బరిలోకి దిగుతారు. ఇక టీమ్ హెచ్ం జట్టుకు పి.అక్షయ రెడ్డి ( సారథిగా వ్యవహరించనున్నారు. ప్రాచీ యాదవ్, వి.నికేషిణి, ఎల్.శ్రుతిక, కె.అనేరా శాంత్, స్రవంతి, నిత్యశ్రీ, నెల్లుట్ల అక్షయ, కొడిగంటి మనీషా, డివిఎన్ఎం శ్రీ రెణ్య, పప్పు కీర్తన, హరిణి ఈ జట్టుకు ఎంపికయ్యారు. ఈ యువ ప్లేయర్లు తమ ప్రతిభతో లీగ్‌లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు.

## ఫోర్బ్స్ ఇండియా 2026 జాబితాలో మనోళ్లే తోపులు..







భారత క్రికెటర్లకు మైదానంలోనే కాదు.. బ్రాండ్ ప్రపంచంలోనూ భారీ క్రేజ్ ఉంది. ఆటకు వీడ్కోలు పలికినా కొందరు దిగ్గజాల బ్రాండ్ విలువ ఏమాత్రం తగ్గలేదు. తాజాగా విడుదలైన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 జాబితాలో పలువురు భారత క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు. వీరిలో విరాట్ కోహ్లీ అందరికంటే ముందున్నాడు. మొత్తం భారత సెలబ్రిటీల్లోనూ అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. నంబర్ వన్.. విరాట్ కోహ్లీభారత క్రికెటర్లలో అత్యంత విలువైన బ్రాండ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ ఏకంగా రూ.3,542 కోట్లుగా ఫోర్బ్స్ జాబితా పేర్కొంది. కేవలం క్రికెటర్లలోనే కాదు.. దేశంలోని అన్ని రంగాల సెలబ్రిటీలను కలిపినా కోహ్లీదే అగ్రస్థానం. బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్, ప్రియాంక చోప్రా వంటి ప్రముఖులను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్‌గా నిలవడం విశేషం. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా ఈ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మాస్టర్ బ్లాస్టర్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా నమోదైంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతూనే ఉంది. మొత్తం సెలబ్రిటీల జాబితాలో ఆయన 8వ స్థానంలో నిలిచాడు. నాలుగో స్థానంలో బుమ్రా.. ప్రస్తుత తరం భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత విలువైన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లు. ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో ఉన్నాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు.

## మీరు ఇంగువ వాడుతున్నారా? ఎవరెస్ట్, లాల్‌జీ గోధూ బ్రాండ్లకు FSSAI బిగ్ షాక్




మీరు మీ ఆహారంలో ఇంగువను ఉపయోగిస్తుంటే, ఈ వార్త మీకు ఉపయోగపడుతుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI), రెండు కంపెనీల నుండి మిశ్రమ ఇంగువ అమ్మకాలపై నిషేధం విధించింది. ఆ కంపెనీలు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ, కంపెనీ. పరీక్షలలో వారి ఇంగువ నమూనాలలో కొన్ని నిర్ధారిత ఆహార ప్రమాణాలకు అనుగుణంగా లేవని వెల్లడైంది.
ఈ మొత్తం వ్యవహారం ఒక వినియోగదారుడి ఫిర్యాదు తర్వాత ప్రారంభమైంది. మార్కెట్లో అమ్ముతున్న ఒక బ్రాండ్ ఇంగువ నాణ్యతను ఆ ఫిర్యాదు ప్రశ్నించింది. దీని తర్వాత, FSSAI మార్కెట్‌లోని కొన్ని ప్రముఖ ఇంగువ బ్రాండ్‌లపై దర్యాప్తును ప్రారంభించింది. ప్రాథమిక పరీక్షలలో ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల మిశ్రమ ఇంగువ నమూనాలు నాసిరకంగా ఉన్నట్లు తేలింది.
తదనంతరం ముంబైలోని ఈ రెండు కంపెనీల లైసెన్స్ పొందిన యూనిట్ల నుండి తిరిగి నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను పరీక్షల కోసం ఒక ప్రయోగశాలకు పంపారు. గుజరాత్‌లోని ఉమర్‌గావ్‌లో ఉన్న మరో ఎవరెస్ట్ యూనిట్ నుండి కూడా నమూనాలను సేకరించారు. ఈ పనిలో గుజరాత్ ఆహార శాఖకు చెందిన ఒక బృందం కూడా పాలుపంచుకుంది. పరీక్షించిన తర్వాత ఈ నమూనాలు కూడా నిర్ధారిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది.
మిశ్రమ ఇంగువలో అసలైన ఇంగువ ఎంత ఉండాలి?
మిశ్రమ ఇంగువను కేవలం శుద్ధమైన ఇంగువతో మాత్రమే తయారు చేయరు. శుద్ధమైన ఇంగువను జిగురు, పిండిపదార్థం, గోధుమ పిండి వంటి పదార్థాలతో కలపడం ద్వారా దీనిని తయారు చేస్తారు. నిబంధనల ప్రకారం, ఇందులో కనీసం 5 శాతం ఆల్కహాల్‌లో కరిగే సారం ఉండాలి. మిశ్రమంలో ఉన్న శుద్ధమైన ఇంగువ పరిమాణాన్ని అంచనా వేయడానికి ఇది ఒక ప్రమాణం. అయితే, పరీక్షించిన ఉత్పత్తులలో 0 నుండి 3 శాతం మధ్య మిశ్రమ ఇంగువ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఉత్పత్తులలో కనుగొన్న గాఢతలు సిఫార్సు చేయబడిన ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయి. పర్యవసానంగా మిశ్రమ ఇంగువ ఉత్పత్తి అమ్మకాలపై ఖీూూ× నిషేధం విధించింది. ఈ దర్యాప్తు కేవలం కల్తీ చేసిన ఇంగువకు మాత్రమే పరిమితం కాలేదు. లాల్జీ గోధూ యూనిట్ నుండి తీసుకున్న ఆరు వేర్వేరు రకాల అసలైన ఇంగువ నమూనాలను కూడా పరీక్షించారు. నిబంధనల ప్రకారం.. అసలైన ఇంగువలోని పిండిపదార్థం (స్టార్చ్) 1 శాతానికి మించకూడదు. అయితే, ఈ ఆరు నమూనాలలో పిండిపదార్థం 15 నుండి 32 శాతం వరకు ఉంది. అంటే పిండిపదార్థం నిర్దేశించిన పరిమితి కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. అసలు FSSAI ఏ చర్యలు:విచారణ అనంతరం, వివాదాస్పదమైన మిశ్రమ ఇంగువ ఉత్పత్తి అమ్మకాలను నిషేధిస్తూ ఖీూూ× ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఈ చర్యను ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 కింద తీసుకున్నారు. ఈ విషయంలో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే నిర్ధారిత ప్రమాణాలకు అనుగుణంగా లేని నమూనాలు కలిగిన ఉత్పత్తులపై నియంత్రణ చర్యలు తీసుకోవడం జరిగింది. అందువల్ల ఏదైనా ఆహార ఉత్పత్తికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకునే ముందు ప్యాకేజింగ్ సమాచారాన్ని, సంబంధిత అధికారిక అప్‌డేట్‌లను సంప్రదించడం ఉత్తమం.

## ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ డేట్స్ వచ్చేశాయ్.. డిస్కౌంట్లు చూస్తే నోరెళ్లాబెట్టాల్సిందే..




ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ డేట్స్ వచ్చేశాయి. ఈ మెగా సేల్ అక్టోబర్ 9 నుంచి ప్రారంభం కానున్నట్లు ఫ్లిప్‌కార్ట్ అధికారికంగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక మైక్రోసైట్‌ను లైవ్ చేస్తూ, బ్యాంక్ డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్ల వివరాలను వెల్లడించింది. సాధారణ యూజర్ల కంటే ఒక రోజు ముందుగానే ప్లస్ మెంబర్స్‌కు ఈ సేల్ అందుబాటులోకి రానుంది. ఫ్లిప్‌కార్ట్ ప్లస్ , ఫ్లిప్‌కార్ట్ బ్లాక్ సభ్యులు, ఫ్లిప్‌కార్ట్ క్రెడిట్ కార్డ్ హోల్డర్లకు ఈ 24 గంటల ఎర్లీ యాక్సెస్ లభిస్తుంది. ప్రధాన సేల్ ప్రారంభం కాకముందే పరిమిత స్టాక్ ఉండే హాట్ డీల్స్‌ను దక్కించుకునే అవకాశం వీరికి దక్కుతుంది. బ్యాంక్ ఆఫర్లు -- క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు మైక్రోసైట్‌లో పొందుపరిచిన సమాచారం ప్రకారం కస్టమర్లకు భారీ ఆర్థిక రాయితీలు లభించనున్నాయి. తక్షణ డిస్కౌంట్: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులను ఉపయోగించి చేసే కొనుగోళ్లపై గరిష్టంగా 10శాతం తక్షణ తగ్గింపు లభిస్తుందిఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్: ఈ కార్డు వినియోగదారులు అదనంగా 10 శాతం వరకు పొదుపు చేయవచ్చు. సూపర్ మనీ : మొదటి లావాదేవీపై 10శాతం క్యాష్‌బ్యాక్ అందించనున్నారు. యూపీఐ, ఇతర ప్రముఖ పేమెంట్ గేట్‌వేల ద్వారా చెల్లింపులు జరిపే వారికి సైతం ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు ఉంటాయని సంస్థ తెలిపింది. ఏయే భాగాల్లో భారీ తగ్గింపులు? నిర్దిష్ట ఉత్పత్తుల వారీగా ఇంకా ధరలను అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లైయన్స్‌పై భారీ తగ్గింపులు ఉండనున్నట్లు స్పష్టమైంది. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పీసీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఆడియో డివైజ్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ హోమ్ అప్లయన్సెస్, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి గృహోపకరణాలపై భారీ డిస్కౌంట్స్ ఉండనున్నాయి. ఐఫోన్, శాంసంగ్ డీల్‌కొత్త మొబైల్ కొనాలనుకునే వారికి బిగ్ బిలియన్ డేస్ సేల్ అత్యుత్తమ వేదిక కానుంది. ఆపిల్ ఐఫోన్లు: ఇటీవల ఆపిల్ కొత్త ఐఫోన్ 18 ప్రో సిరీస్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో మునుపటి మోడళ్లయిన ఐఫోన్ 16, ఐఫోన్ 17 సిరీస్‌లపై అదిరిపోయే ప్రైస్ కట్స్ వచ్చే అవకాశం ఉంది. శాంసంగ్ గెలాక్సీ: శాంసంగ్ ప్రీమియం ఫ్లాగ్‌షిప్ గెలాక్సీ ఎస్26 సిరీస్‌పై కూడా ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, ధరల తగ్గింపు ఉండవచ్చని టెక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా మెమరీ చిప్‌ల కొరత నెలకొన్నందున కొన్ని ఫోన్ల లభ్యత, తుది ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. సేల్ ప్రారంభ సమయం దగ్గరపడే కొద్దీ నిర్దిష్ట ప్రోడక్ట్ డీల్స్‌ను ఫ్లిప్‌కార్ట్ ఒక్కొక్కటిగా రివీల్ చేయనుంది. పండుగ సీజన్ షాపింగ్ కోసం వినియోగదారులు ఇప్పటి నుంచే తమ విష్‌లిస్ట్‌లను సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వావ్.. డీమార్ట్ కంటే తక్కువ ధరలు.. ఈ స్టోర్లలో సూపర్ ఆఫర్స్.. నెలకు మస్త్ పైసల్ ఆదా..



ఇంటికి కావలసిన నిత్యావసర సరుకులు అనగానే మనదేశంలో అందరికీ ముందుగా గుర్తొచ్చేది డిమార్ట్. తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు దొరుకుతాయనే నమ్మకంతో ప్రతి నెలా అక్కడ క్యూ లైన్లలో నిలబడటం అలవాటైపోయింది. అయితే మారుతున్న డిజిటల్ యుగంలో ఆ పరిస్థితి వేగంగా మారుతుంది. మార్కెట్లోకి వచ్చిన పలు కొత్త టెక్నాలజీ యాప్‌లు, మోడరన్ రిటైల్ విభాగాలు ఇప్పుడు డిమార్ట్‌కు గట్టి సవాలు విసురుతున్నాయి. ధరల విషయంలో పోటీ పడటమే కాకుండా కస్టమర్ల సమయాన్ని ఆదా చేసే సరికొత్త వెసులుబాట్లను అందిస్తున్నాయి.
ఆన్‌లైన్ స్టోర్స్‌షాపింగ్ రంగంలో ప్రస్తుతం పెను సంచలనం సృష్టిస్తున్నవి క్విక్ కామర్స్ యాప్‌లు. ఆర్డర్ చేసిన పది నుంచి పదిహేను నిమిషాల వ్యవధిలోనే ఇంటి తలుపు తట్టే బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి యాప్‌లు, నిత్యావసర ఉత్పత్తులపై ప్రత్యేకమైన క్రాష్ డీల్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా మిగులుతుండటంతో చాలా మంది వీటివైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు జియో మార్ట్ ఏకంగా ఎంఆర్‌పీపై 40 శాతం వరకు ఆఫర్లు ఇస్తూ, ఉచిత డెలివరీతో డిమార్ట్‌కు గట్టి పోటీనిస్తోంది. నాణ్యమైన ఆర్గానిక్ సరుకుల కోసం బిగ్ బాస్కెట్ తమ ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తులపై మంచి డిస్కౌంట్లు ఇస్తుండగా.. అమెజాన్ ఫ్రెష్ , ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ పండుగలు, నెలాఖరు ఆఫర్లు, బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. ఆఫ్‌లైన్ స్టోర్స్‌కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లే కాకుండా నేరుగా వెళ్లి కొనుగోలు చేసే ప్రత్యక్ష స్టోర్లలోనూ అనేక ప్రత్యామ్నాయాలు వచ్చాయి. విశాల్ మెగా మార్ట్‌లో కిరాణాతో పాటు దుస్తులు, హోమ్ అప్లయన్స్ డిమార్ట్ కంటే తక్కువ ధరలకే దొరికే సందర్భాలు ఉన్నాయి. అలాగే రిలయన్స్ స్మార్ట్ బజార్ నిర్వహించే ఒకటి కొంటే ఒకటి ఉచితం ఆఫర్లు మధ్యతరగతి జేబుకు పెద్ద ఊరటనిస్తున్నాయి. ఇక పెద్ద ఎత్తున బల్క్ కొనుగోళ్లు చేసే కుటుంబాలకు మెట్రో హోల్‌సేల్ వంటి చోట్ల దక్కే హోల్‌సేల్ రేట్లు డిమార్ట్ ధరల కంటే తక్కువగా ఉంటున్నాయి. స్మార్ట్ షాపింగ్ఒకప్పుడు తక్కువ ధర అనగానే డిమార్ట్ ఒక్కటే మార్గం అనుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. వినియోగదారులు షాపింగ్ చేసే ముందు ఆన్‌లైన్ యాప్‌లలో లభించే కార్డ్ ఆఫర్లు, ఉచిత డెలివరీ కూపన్లతో పాటు ఆఫ్‌లైన్ ఆఫర్లను పోల్చి చూసుకుంటే.. సమయంతో పాటు ప్రతినెల వేల రూపాయల బడ్జెట్‌ను సులువుగా ఆదా చేసుకోవచ్చు.

శుక్రవారం, సెప్టెంబర్ 18, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
12



# మనకు మనమే శత్రువులం.. అవును, 100 శాతం వాస్తవం

## : శోభిత ధూళిపాళ

సమాజంలో ఒకరి ఎదుగుదలను మరొకరు ప్రోత్సహించరని, మనకు మనమే శత్రువులమని ప్రముఖ నటి శోభిత ధూళిపాళ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక తెలుగు ఇన్‌ఫ్లుయెన్సర్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్‌కు మద్దతు తెలుపుతూ ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఒకరి ఎదుగుదలను మనవాళ్లే ప్రోత్సహించరు" అనే ఆ పోస్ట్‌కు బదులిస్తూ "100 శాతం వాస్తవం" అని ఆమె స్పందించారు. ఈ సందర్భంగా తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న అనుభవాలను శోభిత గుర్తుచేసుకున్నారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఎటువంటి భరోసా లేకుండా ముంబైకి వెళ్లానని, రిస్క్ తీసుకుని ముందడుగు వేశానని తెలిపారు. కొత్త దారుల్లో ప్రయాణించే వారిని, పెద్ద కలలు కనే వారిని ఈ సమాజం పెద్దగా ప్రోత్సహించదని తాను గమనించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా, ఒక రంగంలోకి కొత్తగా అడుగుపెట్టేవారికి అప్పటికే అక్కడ స్థిరపడిన వారు అరుదుగా మద్దతు ఇస్తారని, అదే మహిళల విషయానికొస్తే సవాళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే, ఈ వ్యాఖ్యలు తాను కెరీర్ ప్రారంభించిన నాటి పరిస్థితులకు సంబంధించినవని, ఇప్పుడు పరిస్థితులు మారి ఉంటాయని ఆశిస్తున్నట్లు శోభిత స్పష్టం చేశారు. సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవాలని, ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా ఎదిగేందుకు అవసరమైన మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. 'గూఢచారి', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్' వంటి చిత్రాలతో గుర్తింపు పొందిన శోభిత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# చిరంజీవికి జోడీగా స్నేహ..?

## 'కాకా'పై భారీ అంచనాలు



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'కాకా'పై చుట్టూ ఇండస్ట్రీలో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. ఈ చిత్రంలో సీనియర్ నటి స్నేహ చిరంజీవికి జోడీగా భార్య పాత్రలో కనిపించనున్నారనే వార్త సినీ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్ సీనియర్ టాప్ స్టార్లయిన నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణలతో పాటు చిరంజీవితోనూ నటించిన అరుదైన మైలురాయిని స్నేహ సొంతం చేసుకుంటారు.
మరోవైపు, చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడ్యూసర్లతో చిరంజీవి ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, త్వరలోనే ఫస్ట్ సింగిల్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్వా పరిశ్రమలో పనిచేసే 'కె. సత్యం' అనే సాధారణ వ్యక్తి వెనుక ఉన్న భిన్నమైన యాక్షన్ కోణంతో సాగే కథలో నటి అనశ్వర రాజన్ 'అమ్ములు పాప'గా ముఖ్య పాత్ర పోషిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు మేకర్స్ వేగంగా అడుగులు వేస్తున్నారు. ం

# మంత్రాలయంలో ఉపాసన కొణిదెల ప్రత్యేక పూజలు



కర్నూలు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ భార్య ఉపాసన కొణిదెల పర్యటించారు. ఉదయాన్నే ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రాలయానికి చేరుకున్న ఆమెకు రాఘవేంద్ర స్వామివారి ఆలయ అధికారులు, పీఠం ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. మంత్రాలయం పర్యటనలో భాగంగా ఉపాసన ముందుగా స్థానిక గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామివారి మూల బృందావనాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామిని దర్శించుకోగా, ఆయన ఉపాసనకు మంత్రాలయం విశేష శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉందని ఈ సందర్భంగా ఆమె హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు, తమ అభిమాన కథానాయకుడు చరణ్ భార్య మంత్రాలయానికి వచ్చారన్న సమాచారం వ్యాపించడంతో... ఆమెను చూసేందుకు అభిమానులు, స్థానిక భక్తులు ఆలయ ప్రాంగణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మంత్రాలయం మఠ పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

# అమెరికాలో నాని 'ప్యారడైజ్'కు భారీ క్రేజ్..

## అడ్వాన్స్ బుకింగ్స్‌తోనే లక్షల డాలర్లు

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ అంచనాలను పెంచుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమా సృష్టిస్తున్న సంచలనం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం, ఒక రోజు ముందుగానే ప్రీమియర్ షోలతో సందడి చేయనుంది. నార్త్ అమెరికాలో ఇప్పటికే ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్స్‌లో 'ప్యారడైజ్' సరికొత్త రికార్డులు నమోదు చేస్తోంది.
శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై మొదటి నుంచీ భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్టే ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది గంటల్లోనే లక్ష డాలర్ల మార్కును దాటి, అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన తెలుగు చిత్రంగా రికార్డు సృష్టించింది. మధ్యలో బుకింగ్స్ కాస్త నెమ్మదించినా, విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మళ్లీ ఊపందుకున్నాయి.
తాజాగా ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్లు వెల్లడించిన వివరాల ప్రకారం, నార్త్ అమెరికాలో ప్రీమియర్ల కోసం ఇప్పటివరకు 15,000కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రీ-సేల్స్ రూపంలోనే 350ఖ (సుమారు రూ. 3.35 కోట్లు) డాలర్ల వసూళ్లు దాటినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. నాని సినిమాలకు మొదటి నుంచి యూఎస్‌లో మంచి మార్కెట్ ఉండటంతో, 'ప్యారడైజ్' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
ఈ చిత్రంలో నాని 'జడల్' అనే పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన 'ఏషనాగుల' పాట యూట్యూబ్‌లో కేవలం 17 రోజుల్లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఎలాంటి ట్రైలర్ లేకుండానే ఈ సినిమా నేరుగా థియేటర్లలోకి రానుంది.
సినిమాపై ఉన్న నమ్మకంతోనే చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ప్రీ-సేల్స్ మరింత పెరిగి, 'ప్యారడైజ్' బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ సాధిస్తుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




# 'రణబాలి' నుంచి బిగ్ అప్డేట్..

## షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టిన మూవీ టీమ్

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' చిత్రీకరణ పూర్తయింది. గత 130 రోజులుగా నిర్విరామంగా సాగుతున్న షూటింగ్‌కు చిత్రబృందం గుమ్మడికాయ కొట్టింది. ఈ విషయాన్ని దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. తన చిత్ర బృందాన్ని 'అలుపెరుగని సైన్యం'గా అభివర్ణిస్తూ, ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. భారీ అంచనాల నడుమ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టి-సిరీస్ సమర్పణలో పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 16న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. విడుదలకు చాలా ముందే సినిమా సిద్ధమవుతుందని, ఇప్పటికే మొదటి భాగం నేపథ్య సంగీతం (బీజీఎం) కూడా పూర్తయిందని చిత్రబృందం తెలిపింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్, రష్మిక కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న 'జయమ్మ' పాత్రకు తన తల్లి పేరు పెట్టుకున్నట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ ఇటీవల వెల్లడించారు. "రణబాలి గుండెల్లో ప్రేమగా, ఆత్మలో స్ఫూర్తిగా, వెన్నెముకలో ధైర్యంగా, అతని పిచ్చిలో మాధుర్యంగా జయమ్మ పాత్ర ఉంటుంది" అని ఆయన అభివర్ణించారు. రష్మిక తన నటనతో జయమ్మ పాత్రకు ప్రాణం పోయడమే కాకుండా ఆ పాత్రను శాశ్వతంగా నిలిచిపోయేలా చేసిందని ప్రశంసించారు.




# సరైన తోడు దొరికితే రెండో పెళ్లికి సిద్ధం

## : సీనియర్ నటి ప్రేమ

ఒకప్పటి ప్రముఖ హీరోయిన్, తెలుగు, కన్నడ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ప్రేమ తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తోడు అనేది ముఖ్యమని, తనకు నచ్చిన, తనను అర్థం చేసుకునే వ్యక్తి దొరికితే రెండో వివాహం చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేసింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ప్రేమ, తన పెళ్లి, విడాకుల గురించి ప్రస్తావించారు. 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పచ్చును వివాహం చేసుకున్నానని, అయితే కొంతకాలం తర్వాత అభిప్రాయ భేదాలు రావడంతో 2016లో ఫ్యామిలీ కోర్టు ద్వారా పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని చెప్పింది. అప్పటి నుంచి ఒంటరిగానే ఉంటున్నట్లు పేర్కొంది. రెండో పెళ్లి గురించి మాట్లాడుతూ "జీవితానికి తోడు ముఖ్యం. సరైన వ్యక్తి దొరికితే 70 ఏళ్ల వయసులోనైనా పెళ్లి చేసుకుంటాను. దీనికి వయసుతో సంబంధం లేదు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం" అని ప్రేమ పేర్కొంది. గతంలో తన ఆరోగ్యంపై వచ్చిన వదంతులను కూడా ఆమె ఖండించింది. తనకు క్యాన్సర్ సోకిందంటూ వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో, కొన్ని మాధ్యమాల్లో వచ్చే ప్రతీ వార్తను నమ్మవద్దని పేర్కొంది.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com